శనివారం 12.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక


సంపుటి - 34 సంచిక - 143 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 అక్రమాలపై సిట్, సీఐడీ, ఫోరెన్సిక్ నివేదికలు ఆధారాలను బయటపెట్టాయి. ఇంతటి కుంభకోణంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ నేటికీ ప్రజలకు ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నిస్తున్నాం.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్,** ఎమ్మెల్సీ

# ఫైళ్లు కదలాలి.. పాలన పరిగెత్తాలి



- దస్త్రాల పరిష్కారంలో జాప్యం వద్దు
- మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు వేగం పెంచాలి
- నెల రోజుల్లో భౌతిక ఫైళ్లకు ముగింపు
- ఇక ఆన్‌లైన్‌లోనే దస్త్రాల నిర్వహణ
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

**అమరావతి, సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వంలో పాలన వేగంగా సాగాలంటే దస్త్రాల పరిష్కరించడంలో జాప్యం ఉండకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మంత్రులు, కార్యదర్శులు, కలెక్టర్లు దస్త్రాలను త్వరితగతిన క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఫైళ్లను సకాలంలో క్లియర్ చేయకుండా జాప్యం చేస్తున్న అధికారుల తీరుపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులు లేదా అంతకంటే తక్కువ సమయంలో ఫైళ్లను క్లియర్ చేసిన అధికారులను ప్రశంసించిన సీఎం.. గంటల్లోనే ఫైళ్లను క్లియర్ చేసిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. నాలుగు రోజుల సమయం తీసుకుంటున్న మంత్రులు ఫైళ్ల క్లియరెన్స్‌ను వేగవంతం చేయాలని సూచించారు. కలెక్టర్ల సదస్సుకు కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారుల గైర్హాజరుపై వివరణ తీసుకోవాలని సీఎస్ సాయి ప్రసాద్‌ను ఆదేశించారు. ఐఏఎస్ అధికారుల 360 డిగ్రీల నివేదికను కూడా అందరి అభిప్రాయాలు తీసుకుని తయారు చేస్తామని తెలిపారు. కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ వచ్చినప్పుడే పనితీరును సవరించుకోగలమని చెప్పారు. అన్ని ప్రభుత్వ శాఖలు ఇక ఆన్‌లైన్ ద్వారానే ఫైళ్లను నిర్వహించాలని, ఇందుకు నెల రోజుల గడువు ఇస్తున్నామని తెలిపారు. మాన్యువల్ ఫైళ్లు నడిపితే ఇకపై తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. మాన్యువల్ ఫైళ్ల నిర్వహణపై నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ.. ఈ అంశంపై మంత్రులు కూడా దృష్టి పెట్టాలని సూచించారు. మిగతా 2లో...

## కుటుంబమే యూనిట్.. సంక్షేమమే లక్ష్యం

- చిన్న కుటుంబాలుగా విడిపోకుండా సంక్షేమ ప్రయోజనాలు
- పెద్ద కుటుంబాలకు మరింత ప్రయోజనం కల్పించేలా విధానాలు
- కొత్త పెన్షన్లకు ముందే ఫ్యామిలీ యూనిట్ మ్యాపింగ్
- 'వెల్ఫేర్ టు ఎంపవరింగ్ ఫ్యామిలీస్' దిశగా ప్రభుత్వం

2 లో

## శతాబ్దం నాటి భూ సమస్యలకూ పరిష్కారం

- రూ.5 వేల కోట్ల విలువైన 31 వేల ఎకరాలకు విముక్తి
- 232 సుదీర్ఘ భూ వివాదాలు పరిష్కారం.. ఇక జాప్యం వద్దు
- పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు.. నైపుణ్య శిక్షణపై ప్రత్యేక దృష్టి
- 8వ జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు

2 లో

## రాష్ట్రం అంతటా.. 'సంజీవని'



- డిసెంబరు 10 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'
- 5 కోట్ల మందికి వైద్య సేవలు అందించేలా కార్యాచరణ
- కలెక్టర్ల సదస్సులో కీలక సమీక్ష


**అమరావతి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్):** చిత్తూరు జిల్లా కుప్పంలో చేపట్టిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఏఐ ఆధారిత 'సంజీవని' వైద్య కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. కలెక్టర్ల సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండ్యన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యక్రమం అమలు ప్రణాళికను వివరించారు. గ్లోబల్ టెండర్ల ద్వారా టాటా ఎండీ సంస్థను భాగస్వామిగా ఎంపిక చేసినట్లు తెలిపారు. మిగతా 3లో...

## చదువులో వందకు.. వంద శాతం

**విద్యాప్రమాణాల పెంపుపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ**

**విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్**



**అమరావతి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సూచించారు. బోర్డు పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మరింత పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యాశాఖకు సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్లతో జరిగిన సమావేశంలో మంత్రి పలు సూచనలు చేశారు.

పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు మౌలిక వసతులపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని లోకేష్ తెలిపారు. పాఠశాల భవనాలు పటిష్టంగా ఉండేలా చూడాలని, కొత్తగా చేపడుతున్న నిర్మాణాలు నాణ్యమైన ప్రమాణాలతో ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ:** యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలను వివిధ పరిశ్రమలతో అనుసంధానిస్తున్నామని మంత్రి తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకునేలా కోర్సులు, శిక్షణా విధానాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. విద్యార్థులు చదువు పూర్తిచేసిన వెంటనే ఉద్యోగావకాశాలు పొందే విధంగా విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సమన్వయం పెంచుతున్నామని వివరించారు.

మిగతా 2లో...

## భూ సమస్యలపై.. 'మార్చి' టార్గెట్



- ఏళ్లుగా నలుగుతున్న వివాదాలకు చరమగీతం
- ప్రతి 15 రోజులకు ఒక ప్రధాన సమస్యను ఎంపిక చేసి పరిష్కరించాలి
- రెవెన్యూ శాఖలో అవినీతికి 'జీరో టాలరెన్స్': సీఎం

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** కలెక్టర్ల సదస్సు రెండో రోజు రెవెన్యూ, భూపరిపాలన అంశాలపై ప్రత్యేక సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా భూ సమస్యల పరిష్కారం, రీసర్వే పురోగతి, 22-ఏ నిషేధిత జాబితా సవరణలపై భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి సమగ్ర వివరాలు వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా రీసర్వేకు తీసుకున్న మొత్తం 16,816 గ్రామాల్లో ఇప్పటివరకు 9,005 గ్రామాల్లో సర్వే పూర్తయిందని, మిగిలిన 7,811 గ్రామాల్లో వచ్చే నవంబర్ నాటికి మరో విడత పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న భూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని, దశాబ్దాలుగా నలుగుతున్న చారిత్రక భూ వివాదాలు అన్నింటినీ రాబోయే మార్చి నాటికి నూటికి నూరు శాతం పరిష్కరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ సందర్భంగా కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

రాష్ట్రంలో నిషేధిత ఆస్తుల (22-ఏ) జాబితా పేరుతో సామాన్య రైతులకు జరుగుతున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన 444, 445 జీవోల ద్వారా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని సీసీఎల్ఏ వివరించారు. ఇకపై వెబ్‌ల్యాండ్‌లో నమోదైన డేటా మిగతా 2లో...

## సూపర్ సిక్స్..

## ప్రజలకు ప్రత్యక్ష భరోసా!



- అన్నదాత నుంచి ఆటో డ్రైవర్ వరకు ఆర్థిక భరోసా
- ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలు, దివ్యాంగులకు ఊరట
- విద్యార్థుల చదువుకు 'తల్లికి వందనం' అండ

**అమరావతి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న 8వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు సూపర్ సిక్స్ పథకాల అమలు, పురోగతిపై అధికారులు వివరించారు. మిగతా 2లో...

## విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గింపు



- పునరుత్పాదక ఇంధనానికి భారీ లక్ష్యాలు
- ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్

**అమరావతి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరుగుతున్న ఎనిమిదో జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ రాష్ట్ర విద్యుత్ రంగంలో సాధించిన పురోగతి, భవిష్యత్ లక్ష్యాలు, వ్యయ నియంత్రణ చర్యలను వివరించారు.

రాష్ట్ర విద్యుత్ రంగంలో 21,852 మెగావాట్ల కాంట్రాక్టెడ్ సామర్థ్యం ఉండగా, 2025-26లో 79,971 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదైందని తెలిపారు. విద్యుత్ కొనుగోలు సగటు వ్యయం యూనిట్‌కు రూ. 4.90గా ఉందని, పునరుత్పాదక ఇంధన వాటా 39.9 శాతంగా ఉందని పేర్కొన్నారు. 2035 నాటికి రాష్ట్ర విద్యుత్ డిమాండ్ సుమారు 1,80,000 మిలియన్ యూనిట్లకు చేరుకునే అవకాశం ఉన్నందున, మిగతా 3లో...

## ఆరోగ్యానికి భారీ బలోపేతం



- రూ.1,272 కోట్లతో ఆరోగ్య వసతుల బలోపేతం
- రూ.249.50 కోట్లతో 22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులు రేపు నడ్డా, చంద్రబాబు చేతుల మీదుగా శ్రీకారం
- సెప్టెంబరు 17 నుంచి నెల రోజుల 'సేవా సంకల్ప్ అభియాన్'
- రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో వైద్య సేవలను బలోపేతం చేసేందుకు రూ. 1,272 కోట్లతో చేపట్టిన ఆరోగ్య వసతుల పనులను వేగంగా పూర్తి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం విజయవాడలో ఆరోగ్య ప్రాజెక్టులను ప్రారంభిస్తారని చెప్పారు.

అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో మెరుగైన వైద్యం అందించడంతోపాటు, వ్యాధులను తొలిదశలోనే గుర్తించేందుకు రూ. 249.50 కోట్లతో పూర్తి చేసిన మిగతా 3లో...



## ఫిర్యాదులకు.. ఏఐ పరిష్కారం

- ఇప్పటికే చాట్‌బోట్ ద్వారా 23,100 అర్జీల నమోదు
- పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో ఆదర్శంగా 4 జిల్లాలు
- ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్) కొత్తగా అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. దీనివల్ల గ్రీవెన్స్ పరిష్కారం మరింత సులభతరమవుతుందని దీన్ని కలెక్టర్లు సద్వినియోగం మిగతా 3లో...

# చదువులో వందకు.. వంద శాతం



(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యం వెబ్ పోర్టల్ ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలతో పాటు అవసరమైన స్కిల్ టూల్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నామని లోకేష్ తెలిపారు. మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.

**డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీపై దృష్టి :** రాష్ట్రంలో అక్షరాస్యత పెంపుతో పాటు డిజిటల్, ఫైనాన్షియల్ లిటరసీని కూడా విద్యాశాఖ ప్రాధాన్యతగా తీసుకుని పనిచేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థులకు పుస్తక పరిజ్ఞానంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రకృతి విపత్తుల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్వయం రక్షణ చర్యలపై కూడా పాఠశాలల్లో శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. విపత్తులు సంభవించినప్పుడు విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేలా వారికి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

**మారుతున్న అవసరాలకు అనుగుణంగా కరిక్యులమ్:** భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని తీర్చిదిద్దేందుకు కరిక్యులమ్ మార్పుపై రోడ్‌మ్యాప్ రూపొందించుకుని ముందుకు సాగుతున్నామని నారా లోకేష్ వెల్లడించారు. విద్యార్థుల్లో పాఠ్యాంశ పరిజ్ఞానంతో పాటు నైపుణ్యాలు, సృజనాత్మకత, సాంకేతిక అవగాహన, జీవన నైపుణ్యాలను పెంపొందించే విధంగా కరిక్యులమ్‌ను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

జిల్లాల వారీగా విద్యా రంగంలో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని మంత్రి సూచించారు. విద్యార్థుల ఫలితాలు, పాఠశాలల మౌలిక వసతులు, నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ విద్య వంటి అంశాలపై నిరంతరం సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు.

# ఫైళ్లు కదలాలి.. పాలన పరిగెత్తాలి

(మొదటి పేజీ తరువాయి)




**గ్రామాలకు వెళ్లండి...సమస్యలు పరిష్కరించండి:** కలెక్టర్ల కాన్ఫరెన్సులో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో టెక్నాలజీ, పాజిటివ్ పర్సెప్షన్ అంశాలపై సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. "పీజీఆర్ఎస్ దరఖాస్తులను ప్రజలకు సంతృప్తి కలిగేలా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు నాలుగు సార్లు గ్రామాలకు వెళ్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ఇకపై ఈ పర్యటనల వివరాలను కూడా ఇవ్వాలి. మున్సిపాలిటీల్లోనూ ఇదే ప్రక్రియ జరగాలి. ప్రతి సోమవారం ఆర్టీజీఎస్ ద్వారా క్షేత్రస్థాయి అంశాలను సమీక్షిస్తున్నా" అని ముఖ్యమంత్రి అన్నారు.

**అన్ని శాఖల్లో టెక్నాలజీ వినియోగం:** "ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలి. అన్ని రంగాల్లోనూ డీప్‌టెక్‌ను అమలు చేయాలి. దాని ద్వారా అదనపు అభివృద్ధిని సాధించేందుకు అవకాశం ఉంటుంది. టెక్నాలజీతో రెవెన్యూ పెంచుకోవచ్చు. సంపద సృష్టించేలా ప్రణాళికలు సిద్ధం చేయవచ్చు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని ఉంచేలా చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం ప్రత్యేకంగా విధి విధానాలు రూపొందించాలి. డేటా లేక్‌లో ఉన్న సమాచారాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుంటే సత్వర నిర్ణయాలు తీసుకోవచ్చు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ విభాగాల్లో ఏఐ స్టాక్ టెక్నాలజీని వినియోగించాలి. జీఎస్టీలో ఏఐ స్టాక్ వినియోగం ద్వారా ఫలితాలు వస్తున్నాయి. పెద్ద ఎత్తున పెండింగ్‌లో ఉన్న కోర్టు కేసుల్లో కూడా లీగల్ ఏఐ స్టాక్‌ను వినియోగించాలి."అని సీఎం చంద్రబాబు సూచించారు.

**సమస్యల్లేని సమాజం కోసం పనిచేయాలి:** "సమస్యలు లేని సమాజం కోసం అందరూ పనిచేయాలి. ప్రతి జిల్లాకు వచ్చినప్పుడు వివిధ పౌరసేవలపై వ్యక్తమవుతున్న ప్రజాభిప్రాయాన్ని సభల్లోనే చదివి వినిపిస్తున్నాను. ప్రభుత్వం అందించే సేవలతో పాటు సంక్షేమ పథకాలపై కూడా ప్రజల్లో సానుకూలత వ్యక్తం కావాలి. లోటుపాట్లను సవరించుకోవడం ద్వారా మరింత సమర్థంగా సేవలు, సంక్షేమ పథకాలను అందించే అవకాశం ఉంటుంది. ప్రజల కోసం స్కీంలను అందుబాటులోకి తీసుకురావడం, పాలసీలను రూపొందించడంతో పాటు వాటిని సులభంగా ప్రజలకు అందించేలా చేసినప్పుడే వాటికి సార్థకత ఉంటుంది. ప్రజల్లో పరిపాలన పట్ల సానుకూల ధోరణి వ్యక్తమయ్యేలా ప్రతి ఒక్కరూ పనిచేయాలి. సరిగా పనిచేయని వారిని పక్కన పెట్టి, పనిచేసే వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించాలి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**స్వర్ణ వార్డు, గ్రామ కార్యాలయాల్లో సిబ్బంది రైషనలైజేషన్:** "స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయాలకు ఒక్కో ఈవీ సైకిల్ ఇవ్వాలి. స్వర్ణవార్డు, గ్రామ కార్యాలయాల్లో ఒక్కో ఉద్యోగికి ఒక్కో బాధ్యత మాత్రమే అప్పగించాలనే విధానం కష్టసాధ్యమైంది. కొంతమందిపై ఎక్కువ పని భారం ఉంటే.. మరికొందరికి చాలా తక్కువ పని ఉంటోంది. దీన్ని సరిచేసి రేషనలైజ్ చేయాలి. పనిభారం పెంచకుండా వివిధ బాధ్యతలను అప్పగించేలా చూడాలి. ప్రతి పంచాయతీ పరిధిలోని స్వర్ణ గ్రామ సిబ్బంది విధుల స్పష్టత కోసం జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలి" అని సీఎం ఆదేశించారు.

# భూ సమస్యలపై.. 'మార్చి' టార్గెట్



(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే 22-ఏ జాబితాకు ప్రామాణికమని, ఇతర శాఖలు ఇచ్చే వేర్వేరు జాబితాలకు తావులేదని స్పష్టం చేశారు. రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని నిషేధిత జాబితాను ఆటోమేటిక్‌గా వెబ్‌ల్యాండ్‌కు అనుసంధానించడం ద్వారా గతంలో 22-ఏ జాబితాలో చిక్కుకుపోయిన దాదాపు 16 లక్షల ఎకరాల భూమిని ప్రభుత్వం తొలగించి రైతులకు ఊరట కల్పించిందని తెలిపారు. గతంలో కలెక్టర్ల వద్ద ఉన్న 22-ఏ తొలగింపు అధికారాలను ఆర్డీవో స్థాయి అధికారులకు అప్పగించామని, అలాగే ఎవరి భూమినైనా నిషేధిత జాబితాలో చేర్చాలంటే పట్టాదారుకు తప్పనిసరిగా నోటీసు ఇవ్వడంతో పాటు, జాయింట్ కలెక్టర్ అనుమతి, విచారణ ఉత్తర్వులు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల్లో మాన్యువల్‌గా పేర్లు నమోదు చేసే పద్ధతిని పూర్తిగా నిలిపివేశామన్నారు. కలెక్టర్ల పరిధిలో పెండింగ్‌లో ఉన్న 2,918 దరఖాస్తులను వచ్చే అక్టోబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు.

భూ రికార్డుల్లో అక్రమాలకు, మార్పులకు ఆస్కారం లేకుండా అత్యంత పటిష్టమైన 'మీభూమి - బ్లాక్‌చైన్' సాంకేతికతను అమలు చేస్తున్నామని అధికారులు తెలిపారు. మొదటి దశలో ఏడు జిల్లాల్లోని 89 గ్రామాల్లో 1.47 లక్షల భూభాగాలకు (ఎల్‌పీఎం) బ్లాక్‌చైన్ ఐడీలను విజయవంతంగా కేటాయించామని పేర్కొన్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు స్పందిస్తూ, వచ్చే 45 రోజుల్లోగా సర్వే మరియు రికార్డుల సవరణ (ఆర్వోఆర్) పూర్తయిన భూములన్నింటినీ పాత బకాయి లేకుండా బ్లాక్‌చైన్ పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించారు.

నవంబర్ 1వ తేదీ నుంచి రియల్ టైమ్‌లో ఏ భూమి సర్వే పూర్తయినా వెంటనే దాన్ని బ్లాక్‌చైన్‌లో భద్రపరిచే వ్యవస్థను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సియం నిర్దేశించారు. ప్రజల నుంచి వచ్చే మ్యుటేషన్ దరఖాస్తుల తిరస్కరణ రేటును గతంలో ఉన్న 20 శాతం నుంచి 2 శాతానికి తగ్గించామని, నోటీసులు ఇచ్చే సమయంలోనూ, పరిష్కరించిన తర్వాత కూడా తప్పనిసరిగా ఈ-కేవైసీ ద్వారా దరఖాస్తుదారుడి ఆమోదం తీసుకుంటున్నామని అధికారులు వివరించారు.

గత రెండేళ్లలో రాష్ట్రంలో దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న 232 భారీ భూ వివాదాలను అధికారులు విజయవంతంగా పరిష్కరించారని, దీనివల్ల 1.18 లక్షల కుటుంబాలకు మేలు జరగడంతో పాటు, రూ. 5,014 కోట్ల విలువైన 31,827 ఎకరాల భూమి వివాదాల నుంచి బయటపడిందని సీసీఎల్ఏ తెలిపారు. ఏలూరు జిల్లాలో కలిదిండి, ఉనికిలి, వైవాక గ్రామాల భూములు, నంద్యాలలోని గుటుపల్లి, తిరుపతిలోని సెట్టిపల్లి, నెల్లూరులోని భగత్ సింగ్ కాలనీ, విశాఖలోని పీఎంపాలెం గృహనిర్మాణ సంస్థ భూములు వంటి సంక్లిష్ట సమస్యలను పరిష్కరించి పేదలకు హక్కులు కల్పించిన తీరును ప్రస్తావించారు. అలాగే రైల్వేకోడూరులో 2013లో డేటా ఎంట్రీ తప్పిదం వల్ల డీకేటీ భూములుగా నమోదైన 10,500 ఎకరాల పట్టా భూముల సమస్యను ఒకటి రెండు రోజుల్లో పరిష్కరిస్తున్నామని, అనంతపురంలో 60-70 ఏళ్లుగా అనుభవంలో ఉన్నప్పటికీ 22-ఏలో చిక్కుకున్న 9,917 ఎకరాల బంజరు భూములకు సంబంధించి 4,352 మంది రైతులకు త్వరలోనే మేలు జరుగుతుందని వెల్లడించారు. నెల్లూరు నగరంలో 6,000 మందికి పట్టాలు ఇస్తామని హామీ ఇవ్వగా, ఇప్పటికే 2,600 పట్టాలు అందజేశామని, మిగిలినవి నెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

ఈ అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు స్పందిస్తూ, రెవెన్యూ పరిపాలనలో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగడానికి వీల్లేదని, అవినీతిపై 'జీరో టాలరెన్స్' విధానం అమలు కావాలని గట్టిగా హెచ్చరించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలు కేవలం సమస్యల్లో చిన్న భాగం మాత్రమేనని, కార్యాలయాల చుట్టూ తిరగలేని పేదల సమస్యలను అధికారులే స్వయంగా గుర్తించాలని సూచించారు. గయాలు, బంజరు, ఈనాం, ఎస్టేట్ భూములు వంటి 80, 100, 120 ఏళ్లనాటి పాత సమస్యలను కలెక్టర్లు, మంత్రులు స్వయంగా గ్రామాల్లోకి వెళ్లి ప్రజల సమక్షంలో సమావేశాలు పెట్టి, బహిరంగంగా, పారదర్శకంగా పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రభుత్వం తీసుకునే చారిత్రక నిర్ణయాలు లబ్ధిదారులకు స్పష్టంగా తెలిసేలా చేయాలని, దీనివల్ల ప్రజల్లో నమ్మకం పెరగడంతో పాటు పాలనపై మంచి గుర్తింపు వస్తుందని స్పష్టం చేశారు. ప్రతి పదిహేను రోజులకు ఒక ప్రధాన భూ సమస్యను ఎంపిక చేసుకుని, వచ్చే మార్చి నాటికి రాష్ట్రంలో దీర్ఘకాలిక భూ వివాదాలన్నింటినీ ఒక ఉద్యమంలా పరిష్కరించి భూ వివాదాలు లేని ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

# కుటుంబమే యూనిట్.. సంక్షేమమే లక్ష్యం

**అమరావతి, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్ ఫైల్):** సంక్షేమ పథకాల ప్రయోజనాల కోసం చిన్న కుటుంబాలుగా విడగొట్టకుండా... భవిష్యత్తులో అన్ని పథకాలను ఫ్యామిలీ యూనిట్‌గానే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. కొత్త పెన్షన్ల జారీకి ముందే కుటుంబాల మ్యాపింగ్ చేపట్టాలని, ప్రస్తుతం ఉన్న లబ్ధిదారులను యథాతథంగా కొనసాగిస్తూనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. రేషన్, పెన్షన్ల కోసం కుటుంబాలు చిన్న కుటుంబాలుగా మారిపోవడం సరికాదన్నారు. పెద్ద కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వడం, ఆ కుటుంబానికి ఎక్కువ ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ విధానమని.. దానికి అనుగుణంగానే పాలసీలు, కార్యాచరణ ఉండాలని సీఎం చంద్రబాబు వెల్లడించారు. 8వ కలెక్టర్ల సమావేశం రెండో రోజున శుక్రవారం సూపర్ -6 పథకాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.



**సంక్షేమం నుంచి కుటుంబ సాధికారత విధానంతో ముందుకు:** కుటుంబంలో ఎంత మంది ఉంటే... అంత మందికి ఐదు కిలోల చొప్పున రేషన్ బియ్యం అందించేలా చూడాలని సీఎం సూచించారు. సంక్షేమ పథకాల అమలులో కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని సమగ్ర ప్రయోజనాలు అందించే విధానాన్ని రూపొందించాలన్నారు. వివిధ పథకాల్లో ఉన్న లోటుపాట్లను సరిచేసి అత్యుత్తమ విధానాలను రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాల కోసం ఇప్పటివరకు రూ. 1.50 లక్షల కోట్ల మేర ఖర్చు చేశామని చంద్రబాబు తెలిపారు. ఇందులో ఒక్క పెన్షన్లకే రూ. 75 వేల కోట్లు వ్యయం చేసినట్లు వెల్లడించారు. ఆర్థిక అసమానతలను తగ్గించి ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సంక్షేమ విధానాలు ఉండాలని అన్నారు. సంక్షేమం నుంచి కుటుంబాలను సాధికారత దిశగా తీసుకెళ్లే 'వెల్ఫేర్ టు ఎంపవరింగ్ ఫ్యామిలీస్' విధానంతో ముందుకు సాగాలని స్పష్టం చేశారు. సెర్ప్, మెప్మా ద్వారా 'వన్ ఫ్యామిలీ.. వన్ ఎంట్రప్రెన్యూర్' కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలని చంద్రబాబు సూచించారు. ఐదు లక్షల మంది మహిళలను ఎంట్రప్రెన్యూర్లుగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టామని తెలిపారు. వివిధ సామాజిక వర్గాలను సాధికారత దిశగా తీసుకెళ్లాలి... అందర్నీ అభివృద్ధి చేయాలన్నారు. హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన విద్య అందించాలని స్పష్టం చేశారు. పీ4 కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు.

**విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి చొరవ:** ప్రతి నెలా మొదటి తేదీని 'పేదల సేవలో' కార్యక్రమం ద్వారా సంక్షేమానికి కేటాయించామని సీఎం తెలిపారు. అదే విధంగా ప్రతి నెలా 9న 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా భూ రికార్డుల ప్రక్షాళన చేపట్టాలని సూచించారు. మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, నాలుగో శనివారం పౌరుల ఆరోగ్య నిర్వహణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల 'సంజీవని' కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు మంచి ఆలోచనలు, విలువలతో కూడిన సమాజ నిర్మాణం అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మహిళలు, శిశువుల్లో రక్తహీనత వంటి సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని, ఇదే 2047 విజన్‌లో కీలక లక్ష్యమని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల ద్వారా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న కాపు కార్పొరేషన్ భవనాలను పూర్తి చేయాలని సూచించారు.

**బుడగజంగాల తరహాలో...:** శ్రీకాకుళం జిల్లాలో యానాటి కొండ సామాజిక వర్గాన్ని ఎస్టీల్లో చేర్చాలనే డిమాండ్‌ను కలెక్టర్ల కాన్ఫరెన్సులో మంత్రి అచ్చెన్నాయుడు ప్రస్తావించారు. చాలా కాలంగా యానాటి కొండ సామాజిక వర్గం వాళ్లు తమను ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నారని అచ్చెన్నాయుడు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం...ఎస్టీల్లో చేర్చే అంశం కేంద్రం పరిధిలో ఉంటుందని.. ఈలోగా ఎస్టీలకు వర్తింపచేసే ప్రయోజనాలను యానాటి కొండ సామాజిక వర్గానికి అందించాలని ఆదేశించారు. బుడగ జంగాల తరహాలో యానాటి కొండ సామాజిక వర్గానికి లబ్ది చేకూర్చాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు హాజరయ్యారు.

# సూపర్ సిక్స్.. ప్రజలకు ప్రత్యక్ష భరోసా!

(మొదటి పేజీ తరువాయి)

రైతులు, మహిళలు, దివ్యాంగులు, ఆటో డ్రైవర్లు, విద్యార్థులు, పేద కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థిక, సామాజిక ప్రయోజనాలు అందేలా పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు.

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్: రైతు పెట్టుబడి అవసరాలు, సాగు వ్యయాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. అర్హులైన రైతు కుటుంబానికి ఏటా రూ. 20 వేల చొప్పున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ద్వారా అందిస్తున్నారు. 2025-26లో 46.86 లక్షల రైతు కుటుంబాలకు రూ. 8,985.41 కోట్లు అందించగా, 2026-27 ఖరీఫ్ విడతలో 46.86 లక్షల కుటుంబాలకు రూ. 3,125.47 కోట్లు విడుదల చేశారు.

స్త్రీ శక్తి: మహిళలు, బాలికలకు సురక్షితమైన ఉచిత ప్రజా రవాణా కల్పించే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 2025 ఆగస్టు 15న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 9,188.77 లక్షల మహిళా ప్రయాణాలు ఉచితంగా జరిగాయి. ప్రభుత్వం రూ. 3,267 కోట్ల వ్యయాన్ని భరించింది. రోజుకు సగటున 24 లక్షల మంది మహిళలు, బాలికలు ప్రయాణిస్తున్నారు.

దివ్యాంగ శక్తి:లి దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నారు. ఈ ఏడాది మార్చి 18న ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు 75.31 లక్షల దివ్యాంగుల ప్రయాణాలు నమోదయ్యాయి. ప్రభుత్వం రూ. 29 కోట్ల సబ్సిడీని భరించింది.

ఆటో డ్రైవర్ సేవలో:ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్ల జీవనోపాధికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏటా రూ. 15 వేల చొప్పున సాయం అందిస్తున్నారు. 2025--26లో 2,90,669 మంది అర్హులైన డ్రైవర్లకు మొత్తం రూ. 436 కోట్ల ఆర్థిక సహాయం అందించారు.

దీపం-2: అర్హులైన మహిళా లబ్ధిదారులకు వంటగ్యాస్ సబ్సిడీ అందించడం ద్వారా కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తున్నారు. ఇప్పటివరకు రూ. 3,942 కోట్ల సబ్సిడీ విడుదల చేసి 1.10 కోట్ల లబ్ధిదారులకు ప్రయోజనం కల్పించారు. ప్రస్తుతం ఆరో విడత అమలులో ఉంది.

తల్లికి వందనం: విద్యార్థుల విద్యా ప్రవేశం, కొనసాగింపు, సమాన అవకాశాలను మెరుగుపరిచేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. 1 నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ. 15 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నారు. 2026--27లో 68.05 లక్షల మంది విద్యార్థులకు రూ. 10,208.68 కోట్ల మేర ప్రయోజనం కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# శతాబ్దం నాటి భూ సమస్యలకూ పరిష్కారం

**అమరావతి, సెప్టెంబర్ 11 (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని భూముల వివాదాలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల చాలా భూములు వివాదాల్లోకి వెళ్లాయని... ఈ వివాదాలను పరిష్కరించడంతోపాటు... శతాబ్ద కాలం నుంచి వివాదంలో ఉన్న భూ సమస్యలను సైతం పరిష్కరిస్తున్నామని చెప్పారు. దీంట్లో భాగంగా ఇప్పటి వం-కు 232 సుదీర్ఘ కాలం పెండింగులో ఉన్న భూ వివాదాలను క్లియర్ చేశామని.. వీటి విలువ సుమారు రూ. 5 వేల కోట్లు ఉంటాయని.. మొత్తంగా సుదీర్ఘంగా వివాదంలో ఉన్న 31 వేల ఎకరాలకు విముక్తి కల్పించామని సీఎం చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన 8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్ రెండో రోజున రెవెన్యూ, విద్య, వైద్యం, నైపుణ్యాభివృద్ధి, పురపాలక, విద్యుత్ శాఖలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ...'వివిధ జిల్లాల్లో దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న భూ సమస్యలకు త్వరితగతిన పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోండి. అంబాజీపేటలో గ్రౌండ్ రెంట్ భూముల అంశం 120 ఏళ్ల కాలం నాటి సమస్య. అలాంటి సమస్యను పరిష్కరించగలిగాం. ప్రజల్లో నమ్మకం, విశ్వాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఈ వ్యవహారాల్లో ఎక్కడా అవినీతి లేకుండా భూ సమస్యల్ని పరిష్కరించాలి. మంత్రులు, అధికారులు కూడా ఈ సమస్యల్ని పరిష్కరించిన విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. రీసర్వే ప్రక్రియ పూర్తైన భూములకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో భద్రత కల్పించాలి. నవంబరు 1 తేదీ నుంచి రియల్ టైమ్ లో ఇంటిగ్రేషన్ చేయండి. రెవెన్యూ సమస్యల పరిష్కారం... ప్రభుత్వం తీసుకుంటున్న పాలసీల గురించి ప్రజలకు వివరించాలి.'అని చెప్పారు.



**నిరంతరాయంగా నైపుణ్యాభివృద్ధి:** "రాష్ట్రంలో పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు వస్తాయన్న ఆశతో యువత ఉంటారు. యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించటం నిరంతర ప్రక్రియ. పీఎం సేతు కార్యక్రమాన్ని విశాఖతో పాటు ఇతర ప్రాంతాలకూ విస్తరించి యువతకు మరిన్ని నైపుణ్యాలు కల్పించాలి. పరిశ్రమలు నుంచి సీఎస్ఆర్ నిధులతోనూ ఈ నైపుణ్యాలను కల్పించే అంశాన్ని పరిశీలించండి. ఏపీకి వచ్చే పరిశ్రమల్లో నైపుణ్యం ఉన్న మన యువతే ఉద్యోగాలు పొందేలా కార్యాచరణ చేపట్టాలి. నియోజకవర్గాల వారీగా జాబ్ ఫెయిర్లు నిర్వహించాలి. ఇప్పటి వరకూ 4.98 లక్షల మంది యువత నైపుణ్యం పోర్టల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నైపుణ్య కల్పనపై ప్రజల్లో కూడా విస్తృత అవగాహన కల్పించాలి. స్థానిక యువతకు ఉద్యోగాల కల్పన జరగాలంటే వారికి నైపుణ్యాల్ని పెంచాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాభివృద్ధి విషయంలో యువతకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించాలి. ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలతో పాటు పరిశ్రమల్ని కూడా అనుసంధానించి అవసరమైన నైపుణ్యాలను పొందేలా చూడాలి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పైనా విద్యార్థులకు నైపుణ్యం సాధించేలా చూడాలి. 2027 నాటికి అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా వందశాతం అక్షరాస్యతను సాధించాలి. స్కూల్ బిల్డింగ్ సేఫ్టీపై ఆడిటింగ్ నిర్వహించి వాటిని సురక్షితంగా మార్చేలా చర్యలు చేపట్టాలి. లిటరేట్ లెర్న్ డ్ స్టేట్ గా ఏపీ మారాలి. స్వచ్ఛవాయు సర్వేక్షణ్ లో గుంటూరుకు జాతీయ స్థాయిలో రెండో స్థానం. నేషనల్ క్లీన్ ఎయిర్ సిటీస్ గా గుంటూరు, విజయవాడలోని వార్డులకు అవార్డులు వచ్చాయి. రూ. 1.05 కోట్ల నగదు ప్రోత్సాహంతో పాటు... జాతీయ స్థాయిలో 5 అవార్డులు ఈ ఏడాది ఏపీలోని నగరాలు దక్కించుకున్నాయి. గుంటూరు, ఏలూరు, విజయనగరం, విజయవాడ, నెల్లూరు, శ్రీకాకుళం, చిత్తూరు నగరాల్లో అత్యుత్తమ పని తీరు ఉంది. ప్రతీ నెలా ఒక రోజు సంజీవని కార్యక్రమం ద్వారా వైద్యారోగ్య పరిరక్షణపై క్షేత్రస్థాయికి వెళ్తున్నాను. ప్రజల ఆరోగ్యం అన్నది అత్యంత ముఖ్యమైన అంశం. టెక్నాలజీ ఇంటిగ్రేట్ చేసి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు.

**విద్యుత్ డిమాండ్ తీర్చేలా ప్రత్యామ్నాయ పద్ధతులు:** "జిల్లా కలెక్టర్లు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి. ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. సూర్యఘర్ పథకం ద్వారా ఎంత ఎక్కువ ఇన్ స్టలేషన్లు జరిగితే.. విద్యుత్ ఉత్పత్తిపై అంత ఒత్తిడి తగ్గుతుంది. కేంద్రం అందిస్తున్న ఈ పథకం ద్వారా సబ్సిడీలు ఇస్తున్నారు. ఈ సబ్సిడీలను ప్రజలకు అందేలా చేయాలి. పీఎం కుసుమ్ కింద కూడా వ్యవసాయ కనెక్షన్లకు సౌరవిద్యుత్ ఏర్పాటు చేయండి. పాఠశాల భవనాలపై సౌర విద్యుత్ ప్యానెళ్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలి. 28 జిల్లాల్లో 2932 భవనాలపై 47 మెగావాట్ల సోలార్ రూఫ్ టాప్ ప్యానళ్లు ఏర్పాటు చేయండి. జిల్లాల కలెక్టర్లు ఇంటింటికీ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సహకరించాలి. విద్యుత్ డిమాండ్ ను తీర్చేలా పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సహా వివిధ ప్రత్యామ్నాయాలకు వెళ్తున్నాం. ప్రతీ ఇంటిపైనా విద్యుత్ ఉత్పత్తి జరిగితే సరఫరా, పంపిణీ నష్టాలు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. 2025-26 ఏడాదిలో సగటు విద్యుత్ కొనుగోలు ధర యూనిట్ కు రూ. 4.97కి తగ్గించాం. ప్రతీ యూనిట్ కు రూ. 0.23 పైసల మేర పొదుపు చేయగలుగుతున్నాం. గడచిన రెండేళ్లుగా విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి టారిఫ్ పెంచలేదు."అని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు.

# ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లకు కూటమి ప్రభుత్వం పూర్తి సహకారం

**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** విశాఖపట్నంలోని గాదిరాజు ప్యాలెస్‌లో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ నిర్వహిస్తోన్న "ఎంఎస్ఎంఈ బిజినెస్ ఎక్స్‌పో-2026" ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో కలిసి సెప్టెంబర్ 11 నుండి 13 వరకు జరిగే ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ పరిశ్రమల ప్రొడక్ట్ స్టాళ్లను మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వయంగా పరిశీలించారు. ఎంఎస్ఎంఈలు, ఫుడ్ ప్రాసెసింగ్, పర్యాటకం, స్టార్టప్ తదితర ఒక్కో స్టాల్ నిర్వాహకులతో ప్రత్యేకంగా మాట్లాడి, ఉత్పత్తులు, వ్యాపార వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్స్‌పోలో మొత్తం 187 స్టాళ్లను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రతినిధులను ప్రశంసించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. "రాష్ట్రంలో మీవీజులు, స్టార్టప్‌లకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. రాష్ట్రంలో పారిశ్రామిక వృద్ధిని పెంచడం, పెద్ద




ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టించడమే లక్ష్యంగా "ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ, ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ పాలసీ 4.0 (2024-29)" విధానాన్ని అమలు చేస్తోంది. ఈ పాలసీ ద్వారా 2030 నాటికి "ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త" అనే వినూత్నమైన దృక్పథాన్ని ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగం ద్వారా ఐదేళ్లలో రూ. 50,000ల కోట్ల పెట్టుబడులను రాబట్టాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకుంది. 1.75 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో ఒకటి చొప్పున 175 మైక్రో పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సరైన గైడెన్స్, కన్సల్టెన్సీ సేవలు అందిస్తూ, వారి వ్యాపారాభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీవీజులకు ప్రత్యేక వింగ్స్ ద్వారా పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న వైజాగ్ నగరంలో ఇలాంటి బిజినెస్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేయడం ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మంచి మార్గదర్శకత్వం లభిస్తుంది. అంతేగాక ఒక ప్రైవేట్ సంస్థగా ఉన్న ఏపీ చాంబర్ షాప్ కామర్స్ ప్రభుత్వ ఆర్థికపర, విధానపరమైన ఆలోచనను తద్వారా సహకారం అందించేందుకు ఒక కామన్ ప్లాట్ఫారం ఈ బిజినెస్ ఎక్స్ పో ద్వారా తీసుకువచ్చింది. ఈ ఎక్స్ పోలను సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాలను విస్తరిస్తూ, తమ ఉత్పత్తులకు తమ కంపెనీని ప్రమోట్ చేసుకొని కొత్త కొత్త ఆలోచనలతో మరింత ముందుకు వెళ్లి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి." అని పేర్కొన్నారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ... "పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సమర్థవంతమైన నాయకత్వంలో రాష్ట్రంలో పర్యాటక రంగం కొత్త పుంతలు తొక్కుతోంది. 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖపట్నం పర్యాటకంగా, పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. త్వరలోనే వైజాగ్ నగరంలో 16 ఫైవ్ స్టార్ హోటళ్లు అందుబాటులోకి రాబోతున్నాయి. పర్యాటక అభివృద్ధికి ఈ ఎక్స్‌పోలు ఎంతో దోహదపడతాయి." అన్నారు.

ఈ కార్యక్రమంలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల వ్యాపారవేత్తలు మరియు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడికి మొదటి స్థానం



**అమరావతి, సెప్టెంబర్ 11(జర్నలిస్ట్ ఫైల్):** ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో మంత్రి అచ్చెన్నాయుడు సరికొత్త రికార్డు సృష్టించారు. ఈ-ఫైళ్ల పరిష్కారంలో వరుసగా మూడోసారి మొదటి స్థానంలో నిలిచి తన పనితీరును చాటుకున్నారు. అత్యంత వేగంగానే కాకుండా పారదర్శకంగా, సమర్థవంతంగా ఫైళ్లను పరిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. ఫైళ్ల పరిష్కారంలో వేగంతో పాటు స్పష్టత, పారదర్శకత, సమర్థతకు ప్రాధాన్యత ఇస్తూ మంత్రి అచ్చెన్నాయుడు ముందుకు సాగుతున్నారని సీఎం ప్రశంసించారు. ప్రభుత్వ పరిపాలనలో జాప్యాన్ని తగ్గిస్తూ, నిర్ణయాలను వేగంగా తీసుకోవడంలో ఈ-ఫైలింగ్ వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ-ఫైల్స్ క్లియరెన్స్‌లో వరుసగా మూడోసారి మొదటి స్థానాన్ని సాధించడం మంత్రి అచ్చెన్నాయుడు పనితీరుకు నిదర్శనమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంటల వ్యవధిలోనే ఫైళ్లను పరిశీలించి పరిష్కరించడం ద్వారా మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేకతను చాటుతున్నారని అభినందించారు. పారదర్శకత, వేగం, సమర్థతకు పెద్దపీట వేస్తూ మంత్రి అచ్చెన్నాయుడు కొనసాగిస్తున్న పనితీరు ఇతర శాఖలకు కూడా ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.

# రాష్ట్రం అంతటా.. 'సంజీవని'

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి సమీక్ష మేరకు 2026 డిసెంబరు 10 నాటికి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 5 కోట్లకు పైగా ప్రజలను కవర్ చేస్తూ సంజీవని కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సెప్టెంబరు నుంచి నవంబరు వరకు మౌలిక వసతులు, ఐటీ పరికరాలు, సిబ్బంది నియామకం, శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. మొత్తం 2,068 ఆసుపత్రుల్లో 2,277 మంది పేషెంట్ కేర్ కోఆర్డినేటర్లు, 76 మంది పేషెంట్ కేర్ మేనేజర్లను నియమించనున్నట్లు తెలిపారు. అక్టోబరు 1 నుంచి నవంబరు 30 వరకు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి హెల్త్‌ఎక్స్ పోర్టల్‌లో ప్రజల ఆరోగ్య వివరాలను నమోదు చేస్తారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 2,006 కేంద్రాల్లో సంజీవని ఎరీనాలను, 30 శాతం ఆసుపత్రుల్లో వీపీఓడీ గదులను సిద్ధం చేయాలని, 1,791 ఆరోగ్య కేంద్రాలకు నిరంతర ఇంటర్నెట్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. డిసెంబరు 10 నాటికి అన్ని కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు.

# గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ




- **జెండా ఊపి ప్రారంభించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గా ప్రసాద్**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌పై మహిళల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిని ముందస్తు దశలోనే గుర్తించి నివారించేందుకు ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గా ప్రసాద్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ఈ సందర్భంగా మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణ, ముందస్తు లక్షణాలు, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని వైద్యులు తెలిపారు. క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా క్యాన్సర్‌కు దారితీసే ముందస్తు మార్పులను గుర్తించి తగిన చికిత్స అందించవచ్చని వివరించారు.

హెచ్‌పీవీ టీకా ప్రాధాన్యత, హెచ్‌పీవీ సంక్రమణ నివారణపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రసూతి, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ వేము, డాక్టర్ శివ రంజని, డాక్టర్ వెంకారెడ్డి, డాక్టర్ జ్యోతుల మురళీకృష్ణతో పాటు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, ఇతర ఆరోగ్య సిబ్బంది ర్యాలీలో పాల్గొన్నారు.

**16న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్**

అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 16న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాట్కో ఇన్వెస్టిగేషన్ బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వం-కు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు.

మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని నిర్వాహకులు కోరారు. "స్క్రీనింగ్ చేయించుకోండి-క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించండి-ఆరోగ్యకరమైన భవిష్యత్తును కాపాడుకోండి" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

ఈ కార్యక్రమాన్ని ప్రసూతి, స్త్రీ వ్యాధుల విభాగం, ఆంకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్, పాథాలజీ విభాగాల సమన్వయంతో నిర్వహించారు.

# కాలజ్ఞాని సన్నిధిలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

**బ్రహ్మం గారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):** కాలజ్ఞాని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారని గురువారం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు వెంకట పద్మలతగురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను మఠం యాజమాన్యం ఆలయ మర్యాదలతో స్వాగతం పలి కి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మఠాధిపతు లు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామిని కలిసి కాలజ్ఞానం గురించి అడిగి తెలుసుకున్నారు.

# ఆరోగ్యానికి భారీ బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

22 కీలక ఆరోగ్య ప్రాజెక్టులను శనివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇందులో రూ. 234.50 కోట్లతో 10 అత్యవసర చికిత్స కేంద్రాలు, రూ. 15 కోట్లతో 12 సమగ్ర ప్రజారోగ్య ప్రయోగశాలలు ఉన్నాయని చెప్పారు.

రాష్ట్రంలో మొత్తం 24 అత్యవసర చికిత్స కేంద్రాలు నిర్మిస్తున్నామని, ఇప్పటికే 10 పూర్తయ్యాయని మంత్రి చెప్పారు. సెప్టెంబరు నెలాఖరుకు మరో మూడు పూర్తి చేసి, మార్చి నాటికి మొత్తం 24 కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

**డిసెంబరులో 'సంజీవని':** డిసెంబరులో రాష్ట్ర వ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించి ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రులను అనుసంధానం చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు అవసరమైన వైద్య సేవలు సమగ్రంగా అందేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 2,800 ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో తొలి మూడేళ్లలో కేంద్ర పథకం కింద రూ. 28.80 కోట్లు మాత్రమే ఖర్చయ్యాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ. 250 కోట్లకు పైగా బకాయిలు చెల్లించి పనులను వేగవంతం చేసిందని



తెలిపారు.

విలేకరుల సమావేశంలో రాష్ట్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ విష్ణువర్ధన్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ సుందరా చారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**మోదీ జన్మదినం సందర్భంగా 'సేవా సంకల్ప్ అభియాన్':** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల ప్రజాసేవ పూర్తి చేసుకున్న సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 17 వరకు దేశవ్యాప్తంగా 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహించనున్నట్లు భాజపా జాతీయ నేత, దక్షిణాది రాష్ట్రాల అభియాన్ ఇన్‌చార్జి, మంత్రి సత్యకుమార్ తెలిపారు.

ప్రజలకు కృతజ్ఞతలు చెప్పడం, వారి సమస్యలు, సూచనలు తెలుసుకోవడం, భవిష్యత్తు సేవకు ఆశీర్వాదం కోరడమే లక్ష్యమన్నారు. స్వర్ణాంధ్ర-- 2047, వికసిత భారత్‌లో ప్రజలను భాగస్వాములను చేయడమే ధ్యేయమన్నారు.

సెప్టెంబరు 17న లిలి'ఆశీర్వాద దీపం'లిలితో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. రక్తదానం, ఆరోగ్యం, పరిశుభ్రత, సైబర్ మోసాలపై అవగాహన, అవయవదాన ప్రచారం తదితర 25 రకాల సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రతి కార్యకర్త రోజూ 25 నిమిషాలు సేవకు కేటాయించేలా ప్రణాళిక రూపొందించామన్నారు. ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు సన్మానాలు నిర్వహిస్తామని చెప్పారు. 'సేవా గాథ', 'సేవా జ్యోతి', 'వికసిత భారత్ యాత్ర' ద్వారా యువతను, ప్రజలను అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అభియాన్ కార్యక్రమాల సమన్వయ బాధ్యతను జాతీయ నాయకత్వం తనకు అప్పగించిందని మంత్రి తెలిపారు.

# విద్యుత్ కొనుగోలు వ్యయం తగ్గింపు

(మొదటి పేజీ తరువాయి)

78.5 గిగావాట్ల సౌర విద్యుత్, 35 గిగావాట్ల పవన విద్యుత్, 22 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్, 25 గిగావాట్ అవర్ బ్యాటరీ నిల్వ సామర్థ్యాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు. మొత్తం రూ. 10 లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.

**విద్యుత్ కొనుగోలు వ్యయం భారీగా తగ్గింపు:** విద్యుత్ కొనుగోలు విధానంలో చేపట్టిన సంస్కరణల ఫలితంగా 2022-24లో నెలకు సగటున రూ. 641.5 కోట్లుగా ఉన్న స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు వ్యయం 2024-26లో రూ. 194 కోట్లకు తగ్గిందని విజయానంద్ తెలిపారు. విద్యుత్ కొనుగోలు సగటు ధర యూనిట్‌కు రూ. 7.78 నుంచి రూ. 5.15కు తగ్గిందన్నారు. మార్కెట్ ఆధారిత ఆర్థిక పంపిణీ, ముందస్తు విద్యుత్ మార్కెట్, తక్షణ విద్యుత్ మార్కెట్, విద్యుత్ పంపిణీని సమర్థంగా నిర్వహించే చర్యలతో కొనుగోలు వ్యయాన్ని మరింత తగ్గించినట్లు తెలిపారు. 2026-27 ఏప్రిల్ నుంచి జూలై వరకు విద్యుత్ కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ. 5.20 నుంచి రూ. 4.97కు తగ్గిందని, యూనిట్‌కు 23 పైసలు ఆదా చేసినట్లు వివరించారు. వినియోగదారులపై అదనపు భారం లేకుండా ఎలాంటి విద్యుత్ టారిఫ్ పెంపు చేయలేదని తెలిపారు. వ్యవసాయ రంగంలోని 20.78 లక్షల మంది వినియోగదారులకు ఉచిత విద్యుత్ కొనసాగుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు చెందిన 22 లక్షల కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆక్వా రంగానికి రాయితీ విద్యుత్ ద్వారా రూ. 1,067 కోట్ల సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు.

**విద్యుత్ సరఫరాలో విశ్వసనీయత:** ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో విద్యుత్ సరఫరా విశ్వసనీయంగా కొనసాగిందని విజయానంద్ తెలిపారు. 15,016 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైన సమయంలోనూ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. రోజువారీ గరిష్ఠంగా 288.90 మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరా నమోదైందని తెలిపారు. ప్రసార నష్టాలను 2.60 శాతానికి పరిమితం చేసినట్లు పేర్కొన్నారు.

**వ్యవసాయ సోలార్ పంపులకు ప్రాధాన్యం:** ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద 2,93,587 వ్యవసాయ సోలార్ పంపులకు కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ నుంచి వంద శాతం ఆమోదం లభించిందని తెలిపారు. 228 ప్లాంట్లకు భూసేకరణ పూర్తికాగా, 196 ప్లాంట్లలో సివిల్ పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ వినియోగదారుల కోసం 664.09 మెగావాట్ల సామర్థ్యం స్థాపించి 3,32,043 విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రభుత్వ భవనాల సౌర విద్యుదీకరణకు సుమారు 201 మెగావాట్ల సామర్థ్యాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామని, 28 జిల్లాల్లో 2,932 ప్రభుత్వ భవనాలపై 46.72 మెగావాట్ల పైకప్పు సౌర విద్యుత్ వ్యవస్థల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు.

**హరిత విద్యుత్ ప్రసారానికి భారీ ప్రాజెక్టు :** భవిష్యత్ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు హరిత ఇంధన ప్రసార మార్గం మూడో దశ ద్వారా 18.4 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను తరలించేందుకు రూ. 21,838 కోట్ల విలువైన ప్రాజెక్టును ప్రతిపాదించినట్లు విజయానంద్ తెలిపారు. ఇందులో 7,872 కిలోమీటర్ల ప్రసార లైన్లు, 9,500 మెగావోల్ట్ యాంపియర్ సామర్థ్యం, ఐదు కొత్త 400/220 కిలోవోల్ట్ ఉపకేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

బ్యాటరీ విద్యుత్ నిల్వ వ్యవస్థ ద్వారా 225 మెగావాట్లు/450 మెగావాట్ అవర్ సామర్థ్యాన్ని 2027 జనవరిలో, 150 మెగావాట్లు/300 మెగావాట్ అవర్ సామర్థ్యాన్ని 2027 ఆగస్టులో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ వాహనాల మౌలిక వసతుల్లో భాగంగా 131 ప్రాంతాల్లో 577 విద్యుత్ వాహన ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**విద్యుత్ రంగంలో కృత్రిమ మేధ వినియోగం:** విద్యుత్ రంగంలో కృత్రిమ మేధ ఆధారిత ఆస్తుల ఆరోగ్య సూచిక, డిజిటల్ జంట వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తున్నట్లు విజయానంద్ తెలిపారు. రాష్ట్ర విద్యుత్ ప్రసార సంస్థ పరిధిలోని 380 ఉపకేంద్రాల్లో డిజిటల్ జంట సాంకేతికతను అమలు చేయడం ద్వారా ఏడాదికి 123 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా చేయడంతో పాటు సుమారు రూ. 6 కోట్ల అదనపు ఆదాయం సాధించినట్లు వెల్లడించారు.

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, పైకప్పు సౌర విద్యుత్ వ్యవస్థలు, ప్రధానమంత్రి కుసుమ్ పథకం, ప్రభుత్వ భవనాల సౌర విద్యుదీకరణ, విద్యుత్ ప్రసార ప్రాజెక్టుల అమలులో జిల్లా కలెక్టర్లు కీలక పాత్ర పోషించాలని విజయానంద్ కోరారు. విద్యుత్ పంపిణీ సంస్థలు, నూతన మరియు పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ, రాష్ట్ర విద్యుత్ ప్రసార సంస్థలతో సమన్వయం చేసుకుంటూ భూమి, రహదారి హక్కు సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వినియోగదారుల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రాజెక్టుల అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్లకు సూచించారు.

# కర్లపాలెంలో ప్రత్యేక పి జి ఆర్ ఎస్



- **వైద్య శిబిరాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ**

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్):** కర్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా గ్రీవెన్స్ పరిష్కార వ్యవస్థ (పి జి ఆర్ ఎస్ ) వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందుతున్న వైద్య సేవలను ఆమె పరిశీలించి, మాతా-శిశు ఆరోగ్య సేవల అమలు తీరుపై ఆరా తీశారు.

శిబిరంలో భాగంగా ఆరోగ్య కార్యకర్తలు మరియు పర్యవేక్షక సిబ్బందితో సమావేశమై పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. గర్భిణీల నమోదు, సకాలంలో ప్రసవపూర్వ పరీక్షలు, ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణీల గుర్తింపు మరియు నిరంతర పర్యవేక్షణ, ఆసుపత్రి ప్రసవాలు, ప్రసవానంతర సంరక్షణ, పిల్లలకు వేయవలసిన టీకాలు, కొనసాగుతున్న ప్రత్యేక కార్యక్రమాలు, అలాగే ఆయుష్మాన్ భారత్ డిజిటల్ ఖాతాల (ఎ బి హెచ్ ఎ ఐడి ) తయారీ వంటి అంశాలపై ప్రగతిని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. విజయమ్మ మాట్లాడుతూ వైద్య రికార్డులను ఎప్పటికప్పుడు ఖచ్చితంగా మరియు తాజా సమాచారంతో నిర్వహించాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులను సకాలంలో పర్యవేక్షించడం ద్వారా ప్రజలకు మెరుగైన నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించవచ్చని తెలిపారు. క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి తల్లికి మరియు బిడ్డకు ఎటువంటి అంతరాయం లేకుండా వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక వైద్య సిబ్బంది మరియు ఆరోగ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ఎంపీడీవో - సీపీఎం విమర్శ




**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండల ఎంపీడీఓ ఎన్నికల విధానాల పట్ల ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్ కుమార్ విమర్శించారు.

గురువారం ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారని సమావేశానికి టిడిపి, వైసిపి, బిజెపి పార్టీలను ఆహ్వానించిన ఎంపీడీవో వామపక్ష పార్టీలను పిలవకపోవడం సరికాదన్నారు. రాష్ట్ర పార్టీలను ఆహ్వానించి జాతీయ పార్టీలైన వామపక్ష పార్టీలను పిలవకపోవడంలో ఆంతర్యమేంటని వారు ప్రశ్నించారు. ఎన్నికల సంబంధించినటువంటి సమావేశాలకు రెండు రోజులు ముందుగానే ఆయా పార్టీల అధ్యక్షులకు, కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేస్తారని అటువంటి పద్ధతిని ఎంపీడీవో పాటించకపోవడం తనకు ఇష్టమైన నచ్చిన వారిని మాత్రమే సమావేశాలకు పిలుచుకోవడం సరికాదని దీనిపైన కలెక్టర్కి ఫిర్యాదు చేయనున్నామని వారు తెలిపారు.

# ఫిర్యాదులకు.. ఏఐ పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

చేసుకోవాలన్నారు. ఆయా జిల్లాల్లో, మండలాల్లో గ్రీవెన్స్ పరిస్థితి ఎలా ఉంది, ఎక్కడెక్కడ ఎన్ని అపరిష్కృత అర్జీలు ఎక్కువ ఉన్నాయనే విశ్లేషణ ఏఐ ఆధారిత పీజీఆర్ ఎస్‌లో ఉంటుందని దీనిద్వారా కలెక్టర్లు ఆ దిశగా దృష్టి కేంద్రీకరించడానికి వీలవుతుందన్నారు. అలాగే పౌరులు కూడా ఏఐ ఆధారిత పీజీఆర్ ఎస్‌లో తమ మొబైల్ నుంచే తమ అర్జీ నమోదు చేయవచ్చని, తమ అర్జీ స్థితిగతులు చాలా సులభంగా తెలుసుకోవచ్చన్నారు. ఇప్పటికే ఈ విధానం ద్వారా 23,100 ఫిర్యాదులు నమోదయ్యాయని చెప్పారు. ఏఐ ద్వారా నే ఈ ఫిర్యాదుల పరిష్కారం అయిన తర్వాత ప్రజల ఫీడ్‌బ్యాక్ కూడా ఆటోమేటిగ్గా తెలుసుకునే సదుపాయం ఉంటుందని చెప్పారు.

**అర్జీల పరిష్కారంలో ఆదర్శంగా నాలుగు జిల్లాలు:** పీజీఆర్ ఎస్ ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో ఆదర్శంగా నిలిచిన కొన్ని జిల్లాల గురించి ఈ సమావేశంలో భాస్కర్ కాటంనేని వివరించారు. నెల్లూరు, నంద్యాల, కృష్ణా, సత్యసాయి జిల్లాలు నిలిచాయని చెప్పారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ ఒన్ వీక్ ఒన్ విలేజ్ అనే కార్యక్రమం ద్వారా ఒక గ్రామానికి వెళ్లి ఆ గ్రామం నుంచి నమోదైన పీజీఆర్ ఎస్ అర్జీలన్నీ ఒకరోజంతా అక్కడే కూర్చొని పరిష్కరిస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ఇలా 11 గ్రామాలను కవర్ చేసి 253 గ్రీవెన్స్ పరిష్కరించగలిగారన్నారు.

**ఒక అర్జీ.. 14 కల్వర్టుల సాకారం:** నంద్యాల జిల్లాలో అక్కడ ఒక గ్రామం నుంచి వచ్చిన అర్జీని అక్కడి కలెక్టరు, అధికారులు పరిష్కరించడంలో వ్యవహరించిన తీరు 14 కల్వర్టుల నిర్మాణానికి దారి తీసిందని చెప్పారు. ఆళ్లగడ్డ మండలం జంబులదిన్నె గ్రామంలో ఎస్సీ శ్మశానవాటికకు వెళ్లాలంటే వాగు దాటి వెళ్లాల్సి వస్తోందని ఒక వ్యక్తి చేసిన అర్జీని పరిష్కరించడమే కాకుండా ఇలాంటి సమస్యలు జిల్లాలో ఎక్కడెక్కడున్నాయని జిల్లా యంత్రాంగం విశ్లేషించి, అలాంటివి 14 ప్రాంతాలను గురించి అక్కడ కల్వర్టులను ఉపాధిహామీ పనుల నుంచి చేపట్టగలిగారన్నారు.

**సత్యసాయి జిల్లాలో న్యాయవాదుల ప్యానెల్‌తో సమస్యల పరిష్కారం :** సత్యసాయి జిల్లా కలెక్టరు పీజీఆర్ ఎస్ ద్వారా వచ్చిన రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం విభిన్నంగా వ్యవహరించారని తెలిపారు. చాలా వరకు రహదారికి సంబంధించి సమస్యలు, రెండు వర్గాల మధ్య వివాదాస్పదంగా ఉన్న సమస్యలను గుర్తించారన్నారు. ఒన్ వీక్ ఒన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ప్యానెల్ ఆఫ్ అడ్వొకేట్లను ఆయా గ్రామాలకు తీసుకెళ్లి ఆయా సమస్యలను ఎలాంటి వివాదాలకు లేకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించి పరిష్కరించగలిగారని చెప్పారు. ఇలాంటివి 251 రకాల అర్జీలను పరిష్కరించారని తెలిపారు. కృష్ణా జిల్లాలో అక్కడి కలెక్టర్ చూపిన చొరవ కారణంగా 25 సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి 84 మందికి లబ్ది చేకూరేలా చేశారన్నారు. మిగిలిన జిల్లాల్లోని అధికారులు కూడా ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని కోరారు.

# అన్నామ్స్‌పల్లిలో ఎస్ఐఆర్ ఫైనల్ హియరింగ్

- ఓటర్ల అభ్యంతరాల పరిశీలన.. తుది నిర్ణయానికి అధికారుల కసరత్తు
- ఓటరు జాబితా పారదర్శకతే లక్ష్యంగా విచారణ ప్రక్రియ
- కడ్తాల్ తహాశీల్దార్ జయశ్రీ



కడ్తాల్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఉండేలా చూడటంతో పాటు,అనర్హులుగా ఉన్న పేర్లపై నిబంధనల ప్రకారం పరిశీలన జరిపే క్రమంలో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం అన్నామ్స్‌పల్లి గ్రామపంచాయతీలో ఫైనల్ హియరింగ్ నిర్వహించారు. ఎస్ఐ ఆర్ లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లకు గౌరవ తహసీల్దార్ శ్రీమతి జయశ్రీ ఆధ్వర్యంలో తుది విచారణ చేపట్టారు.ఓటరు జాబితా అనేది కేవలం పేర్ల సమాహారం కాదని,ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటు హక్కుకు ఆధారమైన కీలక పత్రంగా అధికారులు,ప్రజాప్రతినిధులు పేర్కొంటున్నారు.ఈ నేపథ్యంలో జాబితాలో నమోదైన వివరాల్లో ఏవైనా అభ్యంతరాలు,పొరపాట్లు లేదా అర్హతకు సంబంధించిన సందేహాలు ఉంటే వాటిని విచారణ ద్వారా పరిశీలించడం ఎస్ఐఆర్ ప్రక్రియలో కీలక దశగా మారింది.

**- నోటీసుల నుంచి తుది విచారణ వరకు..**

అన్నామ్స్‌పల్లి గ్రామంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా కొంతమంది ఓటర్లకు నోటీసులు జారీ చేయగా,వారికి తమకు సంబంధించిన అంశాలపై వివరణ ఇచ్చే అవకాశం కల్పించారు.తాజాగా నిర్వహించిన ఫైనల్ హియరింగ్‌లో నోటీసులు అందుకున్న ఓటర్లు హాజరై తమ వివరాలను అధికారుల ముందుంచారు.వారి అభ్యంతరాలు,వివరణలు,అందుబాటులో ఉన్న సంబంధిత వివరాలను అధికారులు పరిశీలించారు.ఈ ప్రక్రియలో ఓటర్లకు తమ వాదన వినిపించే అవకాశం కల్పించడం ప్రాధాన్యత సంతరించుకుంది.ఓటరు జాబితాలో పేరు తొలగింపు,మార్పు లేదా ఇతర సవరణలకు సంబంధించిన అంశాల్లో వాస్తవాలను పరిశీలించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది.దీంతో ఫైనల్ హియరింగ్ ప్రక్రియను స్థానికంగా ప్రజలు ఆసక్తిగా గమనించారు.పారదర్శకతపై దృష్టి ఓటరు జాబితా సవరణలో చిన్న పొరపాటు కూడా అర్హుడైన పౌరుడి ఓటు హక్కుపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున,ప్రతి అభ్యంతరాన్ని నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో అర్హత లేని లేదా నిబంధనలకు విరుద్ధంగా నమోదైన పేర్లను గుర్తించడం కూడా ఎన్నికల ప్రక్రియలో కీలకమే.ఈ రెండు అంశాల మధ్య సమతుల్యత పాటిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది.అన్నామ్స్‌పల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన ఫైనల్ హియరింగ్‌లో అధికారులు,ప్రజాప్రతినిధులు,బీఎల్ఓ,పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పాల్గొనడం గమనార్హం.ఓటర్ల నుంచి వచ్చిన వివరాలను నమోదు చేసి, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేనావత్ శ్రీను,ఉప సర్పంచ్ క్యాతిక మహేష్ యాదవ్,వార్డు సభ్యులు కంబాల ప్రశాంత్,నేనావత్ మోతిలాల్,రామావత్ దేవుల,ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీమతి పుష్పలత,జీపీఓ మహేష్,బీఎల్ఓ కాంచనమాల,పంచాయతీ కార్యదర్శి ధనుంజయతో పాటు నోటీసులు అందుకున్న ఓటర్లు విచారణకు హాజరయ్యారు.

## ఘనంగా జిడబ్ల్యూఏసీ 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




హైదరాబాద్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్(జిడబ్ల్యూఏసి) 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అల్ కుజ్‌లోని డల్స్కో అరేనా ఇండోర్ హాల్‌లోఘనంగా జరిగాయని జిడబ్ల్యూఏసి వ్యవస్థాపక అధ్యక్షులు ధోనికిని కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఇమ్మడి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని గల్ఫ్ కార్మికుల సమస్యలు, సంక్షేమం, భవిష్యత్ అవకాశాలపై సుమారు 45 నిమిషాలు ప్రసంగించారని తెలిపారు. ఇండియా నుంచి ప్రత్యేకంగా వచ్చిన రేలా రేలా సింగర్ గంగా సిస్టర్ కార్యక్రమంలో పాల్గొని ఆకర్షణగా నిలిచినట్లు చెప్పారు. తెలంగాణ గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయనిధి ఫౌండేషన్ సభ్యుల తోపాటు ఫౌండేషన్ తరపున అధ్యక్షులు తోకల శంకర్, ఉపాధ్యక్షులు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగనర్సయ్య, కార్యదర్శి బింగి నరసయ్య, కోశాధికారి బింగి పోశన్న, బహ్రెయిన్ ఉపాధ్యక్షులు దేశబోయిన గంగాధర్, గౌరవ సలహాదారులు పుట్టి రాజు, ఊట్నూరి రాజనర్సయ్య, మాజీ అధ్యక్షులు సముద్రాల తిరుపతి, పోశెట్టి, పల్లికొండ రాములు, ఇంటెప్పు నరేష్, జుంబర్తి నరేష్, కల్లెడ మహేష్, పల్లికొండ అనిల్, బింగి పవన్, పందిరి తిరుపతి, కల్లెడ రాకేష్, పందిరి రాజు, పల్లికొండ హరీష్, బోనగిరి అఖిల్, బోరే సురేష్, దండెం కొండయ్య, కల్లెడ భూమన్న, గడ్డం నవీన్ హాజరైనట్లు తెలిపారు.

## 24 గంటల్లో దొంగతనం కేసు ఛేదించిన శంషాబాద్ పోలీసులు



శంషాబాద్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : షంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు.8వ తేదీన మేకలబండ తండాలోని నిర్మాణ స్థలంలో ఉంచిన సెంట్రింగ్ సామగ్రి, ఐరన్ కట్టింగ్ మెషిన్, ఐరన్ డాగ్స్, సుత్తు లు తదితరాలు 9వ తేదీన కనిపించకపోవడంతో ఫిర్యాదు అందిన ట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ మరియు ఇతర సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టి నిందితుడు అయినటువంటి షేక్ సోహైల్ (26), షాహీన్ నగర్, బార్కాస్, హైదరాబాద్ ను అరెస్ట్ చేశారు.నిందితుడి నుండి చోరీకి గురైన సుమారు రూ.20,000 విలువైన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై గతంలో పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరచగా న్యాయ రిమాండ్ విధించారు.కేసును ఛేదించిన షంషాబాద్ పోలీస్ బృందాన్ని చేవెళ్ల, ఫ్యూచర్ సిటీ ఏసీపీ అభినందించారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- సెప్టెంబర్ 12న మేడ్చల్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్
- కక్షిదారులు రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోవాలి

: జినోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య గౌడ్



మేడ్చల్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్ కోర్టు ప్రాంగణంలో ఈ నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జినోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య గౌడ్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ పడదగిన కేసులు, వివిధ పెండింగ్ కేసులను సులభంగా, త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కోర్టుల చుట్టూ పదేపదే తిరగాల్సిన అవసరం లేకుండా సమయం, ఖర్చు ఆదా చేసుకుంటూ సమస్యలను పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి వేదికగా నిలుస్తుందన్నారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరుపక్షాలు పరస్పర అంగీకారంతో ముందుకు వచ్చి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సీఐ కోరారు. తమ కేసులకు సంబంధించి అర్హులైన కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం



- బహుజన చైతన్యానికి.. మహిళాశక్తికి ప్రతీక ఐలమ్మ
- రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్

కడ్తాల్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ బహుజన చైతన్యానికి,మహిళాశక్తికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం ఉపాధ్యక్షుడు, రావిచేడ్ సర్పంచ్ బొప్పిడి గోపాల్ అన్నారు.వివక్ష, అణచివేతకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ సామాజిక,ప్రజా ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేసిందన్నారు.గురువారం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో వార్డు సభ్యుడు,రజక సంఘం అధ్యక్షుడు సోమరాజు రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకల్లో సర్పంచ్ బొప్పిడి గోపాల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ చరిత్రలో చిట్యాల ఐలమ్మ పాత్ర వెలకట్టలేనిదని అన్నారు.అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం నేటి తరానికి కూడా ఆదర్శమని పేర్కొన్నారు.బడుగు,బలహీన వర్గాల హక్కులను కాపాడేందుకు అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆమె పోరాటం సామాజిక న్యాయం కోసం నిరంతరం స్ఫూర్తినిస్తుందని అన్నారు."ఐలమ్మ పోరాటం ఒక వ్యక్తి పోరాటం కాదు.. అది ఆత్మగౌరవం,సమానత్వం కోసం సాగిన ప్రజా పోరాటం" అని బొప్పిడి గోపాల్ పేర్కొన్నారు.ఆమె ఆశయాలను కేవలం జయంతి,వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, సమాజంలో సమానత్వం,గౌరవం,సామాజిక న్యాయం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.రావిచేడ్ గ్రామంలో చాకలి ఐలమ్మ స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే సంకల్పంతో ఆమె విగ్రహాన్ని ప్రతిష్ఠించామని ఆయన గుర్తుచేశారు.యువత ఐలమ్మ జీవిత చరిత్రను తెలుసుకుని,ఆమె ధైర్యసాహసాలు,పోరాట పటిమను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బందరి యాదయ్య,వార్డు సభ్యులు రమేష్,రామస్వామి,బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేష్ యాదవ్,మాజీ ఉప సర్పంచ్ వెంకటేష్,మాజీ ఎంపీటీసీ యాదయ్య,నాయకులు బాలకృష్ణ,శ్రీనివాస్, లింగం,బిక్షపతి, జితేందర్ రెడ్డి,జమీర్,పవన్ కుమార్, పాండు, రాజు, రాములు,రమేష్ గౌడ్,వెంకటేష్ గౌడ్,దేవేందర్,మల్లేష్ యాదవ్,శ్రీశైలం యాదవ్,రమేష్,యాదగిరి, సత్యనారాయణ, భాస్కర్,గోపాల్ రెడ్డి,నరసింహారెడ్డి, మహేష్, సాయికుమార్,నరేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- 14 వేల కోట్ల బకాయిలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు విద్యను దూరం చేయొద్దు.
- బకాయిలు విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం.
- జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్.



వికారాబాద్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు సంబంధించిన 14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ముందు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల విద్యా హక్కులను సక్రమంగా అమలు చేయకుండా వివక్ష చూపుతోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించాల్సిన ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను పెండింగ్‌లో ఉంచడం వల్ల విద్యార్థులతో పాటు వారి కుటుంబాలపై కూడా ఆర్థిక భారం పడుతోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయడంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే భారీ ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మరింత పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేపడతామని జిల్లా కన్వీనర్ రవీందర్ మహారాజ్ హెచ్చరించారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు విద్యార్థులు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో--కన్వీనర్ మల్లికార్జున్, వెంకటేష్, న్యాయవాది రాజేందర్ గౌడ్‌తో పాటు వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు, జేఏసీ నాయకులు, ధర్మసమాజ్ పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం



జవహర్‌నగర్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : జవహర్‌నగర్‌లోని అంబేద్కర్ నగర్ ధోబీఘాట్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆమె సేవలను, పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ నాయకులు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిరంకుశత్వానికి, దోపిడీకి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని నాయకులు తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. మహిళలు సైతం సామాజిక అన్యాయాలను ఎదుర్కొంటూ హక్కుల కోసం పోరాడగలరని ఐలమ్మ తన జీవితంతో చాటిచెప్పారని పేర్కొన్నారు.చాకలి ఐలమ్మ చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. సమాజంలో అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడంతో పాటు సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐలమ్మ ఆశయాలను కేవలం జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా ఆమె ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ మేయర్, జవహర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మట్లా వినయ్, గాజ్వేల్ శంకర్, పొలాస సాయి, రఫీక్, డీఎస్ఎస్ వెంకటేష్, మంద ఆనంద్, రాజు యాదవ్, ఎరకల వెంకటయ్య, స్వామి, కరుణాకర్, ముక్క నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆమె పోరాట చరిత్రను, ప్రజల కోసం చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. ఐలమ్మ చూపిన బాటలో నడుస్తూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి ఉమ్రా వెళ్లిన మత పెద్దలు



శంషాబాద్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : భగవంతుని కృప లేనిదే ఆయన సన్నిధి చేరలేమని ఇస్లామిక్ మత పెద్దలు అన్నారు.మక్కా మదీనాలను దర్శించుకోవాలంటే భగవంతుని కృప ఉండాలని భగవంతుని కృప లేనిదే దర్శించుకోవడం కష్టమని అన్నారు.52 మంది గల ఉమ్రా బృందం సౌది ఎయిర్ లైన్స్ విమానం బయలుదేరింది.అయితే తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలకు చెందిన డాక్టర్‌లు, ఇంజనిర్‌లు,వ్యాపారులు, ఉద్యోగలు ఉన్నారు.ఉమ్రాలో 15 రోజులపాటు ఉపవాస దీక్షలో ప్రార్ధనలు చేస్తారని తెలిపారు.ఉమ్రా యాత్రికులకు ప్రత్యేక వసతులు మహమ్మద్ ఫయాజ్ అలి ఏర్పాటు చేస్తారని యాత్రికులు తెలిపారు.యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తానని మహమ్మద్ ఫయాజ్ తెలిపారు.

## జవహర్‌నగర్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి

- సీపీఐ ఘన నివాళులు



జవహర్ నగర్: సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ నగర్ ధోబిఘాట్ లోని ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాప్రా మండల సిపిఐ కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహ, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ దశరథ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఐలమ్మ చిన్నతనం నుంచే అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్నారని గుర్తుచేశారు. భూస్వామి కొండలరావు వద్ద కవులుకు తీసుకున్న పొలంలో పండించిన పంటను విస్నూర్ దొర రామచంద్రారెడ్డి ధ్వంసం చేయాలని చూస్తే, "దున్నేవాడిదే భూమి.. మధ్యలో మీ పెత్తనమేంటి?" అని కొడవలి పట్టి నిలదీశారని తెలిపారు. దొరల దౌర్జన్యాలు, కుటుంబంపై జరిగిన దాడులు, అన్యాయపు కేసులకు వెరవకుండా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో చేతిలో రోకలిబండ పట్టి నైజాం సైన్యాన్ని, దొరల అరాచకాలను ఎదిరించి వేలాది ఎకరాల భూములను పేదలకు పంచడానికి ఆమె పునాది వేశారన్నారు.తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు గ్రామాలు, వీధుల్లో పోరాట వీరుల స్మారక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 17న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభకు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, రైతు సంఘం నాయకుడు పి.నరసింహ, మహిళా నాయకులు అనసూయ, డి.మల్లిక, ఆదర్శనగర్ సీపీఐ కార్యదర్శి కిరణ్, చిట్యాల బుచ్చమ్మ, ఈ.నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను అవమానించేలా బీఆర్ఎస్ నేతల చర్యలు

- వెంటనే క్షమాపణ చెప్పాలి: ఎస్సీ సెల్ నాయకుల డిమాండ్




మనోహరబాద్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపిస్తూ దళిత సంఘాలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి వెళ్లిన నేపథ్యంలో అక్కడికి దళితులు వచ్చినందుకు బీఆర్ఎస్ నేతలు రోడ్లను పసుపు నీరు, పాలతో శుద్ధి చేయడం దళితులపై వివక్షను చూపడమేనని మనోహరాబాద్ ఎస్సీ సెల్ నాయకులు ఆరోపించారు. గురువారం తూప్రాన్, మనోహరాబాద్ ప్రాంతాలకు చెందిన దళిత సంఘాల నాయకులు కాంగ్రెస్ నాయకులతో కలిసి మనోహరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితుడిని తెలంగాణ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్, దళితులు రాజకీయంగా ఎదగడాన్ని ఓర్వలేక తాటికొండ రాజయ్యను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ఎన్నికల్లో దళితుల ఓట్ల కోసం మూడు ఎకరాల భూమి, దళిత బంధు వంటి పథకాల పేరుతో ఆశలు చూపి కేసీఆర్ దళితులను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అసెంబ్లీకి దళితుడు సభాపతిగా ఉన్నాడనే కారణంతోనే కేసీఆర్ అసెంబ్లీ సమావేశాలకు హాజరు కావడం లేదని వారు విమర్శించారు. దళితుల ఓట్లతోనే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలు గుర్తుంచుకోవాలని అన్నారు. దళితులను అవమానించేలా వ్యవహరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు రాబోయే ఎన్నికల్లో ఓట్ల కోసం దళితవాడల్లోకి ఎలా వస్తారో చూస్తామని హెచ్చరించారు. దళితుల పట్ల వివక్ష చూపేలా వ్యవహరించిన బీఆర్ఎస్ నేతలు వెంటనే దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నాచారం అశోక్,దండుపల్లి మరాఠీ రాజు,మొద్దు అనిల్ మొద్దు ప్రసాద్,మనోహరబాద్ సర్పంచ్ అనూష భాస్కర్ యాదవ్,సీనియర్ నాయకుడు పురం రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వీరనారి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం



హయత్ నగర్ సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సాయుధ పోరాటంలో దొరల పెత్తనానికి ఎదురు నిలిచి, భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొత్తపేట డివిజన్ బిజెపి అధ్యక్షుడు మంచి రాజేష్ కుమార్ పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భం గాఎల్బీనగర్ చింతల కుంటలోని ఆమెవిగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొరల ఆధిపత్యం, అక్రమ పెత్తనానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మధైర్యంగా తిరగబడిన వీరనారి అనికొనియాడారు. భూమి కోసం మడమ తిప్పకుండా పోరాడిన ఆమె ధైర్యసాహసాలు తెలంగాణ ప్రజల పోరాట పటిమను ప్రపంచానికిచాటిచెప్పాయని పేర్కొన్నారు.కొంగు నడుముకు చుట్టి కొడవలి చేతపట్టి అన్యాయంపై ఎదురు తిరిగిన ఐలమ్మ స్ఫూర్తిని నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చేసిన పోరాటాన్ని స్మరించుకోవడంతో పాటు,ఆమె ఆశయాలు,అడుగుజాడల్లో నడవాలని పిలుపు నిచ్చారు.చాకలి ఐలమ్మ జీవితం ధైర్యానికి, ఆత్మగౌరవానికి, హక్కుల కోసం పోరాడే తత్వానికి ప్రతీక, ఆమె ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు వజీర్ కుమార్ గౌడ్, డివిజన్ కార్యదర్శి సట్టు చంద్రశేఖర్ రవి, నిరంజన్, శ్రీనివాస్, సాయి, మహేష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# కేశంపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి

- ఐలమ్మ పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తాం: సర్పంచ్, ప్యాక్స్ చైర్మన్, సీఐ



**కేశంపేట, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

కేశంపేట మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఎదుట తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, అమరవీరురాలు చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలాధ్యక్షుడు వెంకటాపురం రాములు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ విగ్రహానికి స్థానిక ప్రజలు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ బొజ్జం సంతోష్, ప్యాక్స్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, సీఐ నరహరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొరల అన్యాయాలకు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన ధైర్య సాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ సమాజం ఆమె త్యాగాలను ఎప్పటికీ మరువదన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నరసింహ, రమణ గౌడ్, రజక సంఘం నాయకులు ఆంజనేయులు, ఆలుగొండ శ్రీనయ్య, నరసింహులు, సంతాపూర్ రాజు, శ్రీనివాస్, శీను, రమేష్, రవి, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. ఐలమ్మ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని ప్రతిజ్ఞ చేశారు.

## క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే లక్ష్యం : అర్ధ సుధాకర్ రెడ్డి








**వికారాబాద్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

వికారాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలనే ఉద్దేశంతో వికారాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, టీజేఎంయుగౌరవ అధ్యక్షుడు అర్ధ సుధాకర్ రెడ్డి తన సొంత నిధులతో అనంతగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు.అనంతగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కటి రూ.400 విలువైన క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. మొత్తం రూ.42 వేల విలువైన దుస్తులను సుధాకర్ రెడ్డి స్వయంగా సమకూర్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, వికారాబాద్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మురళి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కాంగ్రెస్ నాయకులు బాలరాజు, కురువ శీను, నర్సింలు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున ప్రైవేట్ స్కూల్ పై సమగ్ర విచారణ చేపట్టాలని డా.బీఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం

- అనుమతులు లేవంటున్నారు.. గుర్తింపు ఎలా వచ్చింది?
- నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై సమగ్ర విచారణకు డిమాండ్
- విద్యాశాఖ–గ్రామపంచాయతీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టాలి
- గ్రామసభ తీర్మానాన్ని అమలు చేసి నివేదికను బహిర్గతం చేయాలి
- పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్



**మహబూబాబాద్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** కురవి మండల కేంద్రంలోని నాగార్జున ప్రైవేట్ స్కూల్‌పై వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కురవి మండల కేంద్రంలోని డా.బీ ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీ అనుమతులు లేవని అధికారులు చెబుతున్నప్పుడు.. అదే పాఠశాలకు విద్యాశాఖ గుర్తింపు ఎలా లభించింది? అనే ప్రశ్నకు సంబంధిత అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పాఠశాల భవన నిర్మాణాలు, అదనపు నిర్మాణాలు, భవన భద్రత, గ్రామపంచాయతీ అనుమతులు, విద్యాశాఖ గుర్తింపు తదితర అంశాలపై వస్తున్న ఆరోపణలను అధికారులు నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.ఆరోపణలు వెలువడినప్పటికీ ఇప్పటివరకు సమగ్ర విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాల్లో అధికారుల నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు. గ్రామపంచాయతీ, రెవెన్యూ, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో సంయుక్త తనిఖీలు నిర్వహించి పాఠశాల నిర్మాణాలు, అనుమతులు, గుర్తింపుకు సంబంధించిన పూర్తి వివరాలను పరిశీలించాలని కోరారు.నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆరోపణల్లో వాస్తవం లేదని తేలితే అధికారికంగా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతులు, గుర్తింపు విషయంలో ఏదైనా లోపం ఉంటే దానికి బాధ్యత ఎవరిదో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు.అలాగే గ్రామసభలో తీసుకున్న తీర్మానాన్ని వెంటనే అమలు చేసి, సమగ్ర విచారణ నిర్వహించి నివేదికను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. విద్యార్థులు చదువుకునే పాఠశాల భవనాల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందన్నారు. తక్షణమే సంయుక్త తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తదుపరి దశలో ఆందోళనలు చేపడతామని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బానోత్ దేవేందర్ నాయక్ హెచ్చరించారు.

# నిర్దవెల్లిలో ఘనంగా ఏడు మెట్ల మైసమ్మ బోనాలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు.. బోనాలతో తరలివచ్చిన మహిళలు



**కేశంపేట, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**

మండలంలోని నిర్దవెల్లి గ్రామంలో గురువారం ఏడు మెట్ల మైసమ్మ బోనాల పండుగను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. బోనాల సందర్భంగా గ్రామంలోని మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అందంగా అలంకరించి నెత్తిన ఎత్తుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. డప్పుల దరువులు, భక్తిగీతాలు, అమ్మవారి నామస్మరణతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారులు, యువత, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఏడు మెట్ల మైసమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపతో గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపసర్పంచ్ సపూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, చెన్నయ్య, రమేష్ నాయక్, రిజ్వాన బేగం, మోహిజ్, మంజుల, జంగేశ్, వెంకటమ్మ, మల్లయ్య, మాజీ సర్పంచ్ జంగయ్య, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, గ్రామ నాయకులు దిద్దెల జంగయ్య, బదుక మల్లయ్య, ముత్యాలు, ఖాజా, బొడ మల్లేష్, రాజేందర్, శివతో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# సాయి నగర్‌లో మట్టి గణపతి విగ్రహాల పంపిణీ – SIR నోటీసులపై ఓటర్లకు అవగాహన



**నాగోల్, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :** నాగోల్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయి నగర్ వార్డ్ ఆఫీసులో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. వినాయక చవితి సందర్భంగా ప్రజలు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడాలని ఈ సందర్భంగా నాయకులు, కాలనీవాసులకు సూచించారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొని కాలనీవాసులకు మట్టి గణపతి విగ్రహాలను అందజేశారు.పర్యావరణానికి హాని కలిగించే రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటి కాలుష్యాన్ని నివారించవచ్చని ఆమె పేర్కొన్నారు.అనంతరం శ్రీ సాయి నగర్ వార్డ్ ఆఫీసులో SIR ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కు సంబంధించి ఓటర్లకు వచ్చిన నోటీసులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నోటీసులు ఎందుకు వచ్చాయి,వాటిలో పేర్కొన్న వివరాలను ఎలా పరిశీలించాలి, ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను ఎలా సరిచూసుకోవాలి అనే అంశాలపై ఓటర్లకు చింతల అరుణ సురేందర్ యాదవ్ వివరించారు.ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కు రక్షించబడేలా ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని, ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బి ఎల్ ఓ ల సహకారంతో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జి ఎస్ ఐ డివిజన్ బీజేపీ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, పంగ శ్యామ్ కుమార్ బద్దం బాలకృష్ణ గౌడ్, కాలనీవాసులు, డి ఈ సందీప్, జవాన్ దర్శన్,ఎస్ ఎఫ్ ఏ సురేష్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్పల్లిలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు



**ధర్పల్లి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
ధర్పల్లి మండల కేంద్రంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను నాయకులు, రజక సంఘ ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఆర్మూర్ చిన్న బాల్ రాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ ముక్తి కోసం దొరలు, నైజాం భూస్వాములకు ఎదురొడ్డి నిలిచిన ఐలమ్మ ధైర్యసాహసాలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా చైతన్యానికి, హక్కుల పోరాటానికి ఆమె నిలువెత్తు నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెలిమెల శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఎజ్జా శ్రీకాంత్, నాయకులు సుభాష్‌తో పాటు రజక సంఘ నాయకులు, కుల సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మ సేవలను స్మరించుకున్నారు.

# సిరికొండలో దళిత జేఏసీ నాయకులనిరసన ర్యాలీ

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై వ్యాఖ్యలను ఖండించిన నాయకులు





**సిరికొండ, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై శాసనమండలి సభ్యుడు తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం సిరికొండ మండల కేంద్రంలో దళిత జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుండి తెలంగాణ చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తరలివచ్చి తమ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా దళిత జేఏసీ నాయకులు నక్క రాజేందర్, రావూట్ల రమేష్, నక్క రాజేశ్వర్మొట్టల రాము,చిట్యాల రవి శంకర్ లు మాట్లాడుతూ... రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న దళిత వర్గానికి చెందిన గడ్డం ప్రసాద్‌పై చిత్తశుద్ధి లేని వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించదగినదన్నారు. వ్యాఖ్యలు చేసిన బాధ్యులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.డప్పులతో కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడి పిలుపులో భాగంగా అక్కడికి వెళ్లిన దళిత సోదరులు తిరిగి వెళ్లిన అనంతరం... "దళితులు రావడం వల్ల ఈ ప్రాంతం మైలపడిందంటూ" పసుపు నీళ్లు చల్లి దళిత సమాజాన్ని అవమానించారని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు లేకుండా మీరు బ్రతకలేరనే విషయాన్ని మరచి పోయారా అంటూ దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించి, పసుపు నీళ్లు చల్లిన బాధ్యులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వారు పట్టుబట్టారు. సమాజంలో ఇంకా ఇలాంటి వివక్షాపూరిత చర్యలకు పాల్పడటం సరికాదని, బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని దళిత జేఏసీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఉద్యమిద్దాం

- తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అసలైన వారసులు కమ్యూనిస్టులే
- సిపిఎం యాచారం మండల కార్యదర్శి అల్లంపల్లి నరసింహ



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి చిట్యాల ఐలమ్మ 41వర్ధంతి మరియు వారోత్సవాలు ఈరోజు యాచారం మండల కేంద్రంలో సిపిఎం యాచారం మండల కమిటీ అధ్వర్యంలో జరిగయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ్మా గారు హాజరై కామ్రేడ్ చిట్యాల ఐలమ్మ గారి విగ్రహానికి పూల మాలలు వేసి విప్లవ జోహార్లు అర్పించారు అనంతరం ఆలంపల్లి నరసింహ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో వారికి గులాములుగా జమీందార్లు,జాగీర్దార్లు,దేశ్‌ముఖ్‌లలో జెన్నరెడ్డి ప్రతాపరెడ్డి,వి సునూర్ రామచంద్రారెడ్డి, లాంటి దుర్మార్గులు ఉన్నారని ఇలాంటి ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి,వెట్టిచాకిరి విముక్తి కోసం పుచ్చలపల్లి సుందరయ్య గారి నాయకత్వంలో రావి నారాయణరెడ్డి, ఆరుట్ల రామచంద్రారెడ్డి కమలా దేవి, భీమి రెడ్డి నర్సింహ్మా రెడ్డి,తోలి అమరుడు దొడ్డి కొమరయ్య, వీరనారి చిట్యాల ఐలమ్మ,కాచం క్రిష్ణ మూర్తి, (రాగన్న), ముస్లింలైనా షేక్ బందాగి ముఖ్దుం మొహియుద్దీన్,షోయబుల్లా ఖాన్, అల్లం కుందిమీరి లాంటి మహనీయులు మరెందరో చేసిన పోరాటం ద్వారా చైతన్యం పొందిన మట్టి మనుషులు తిరుగుబాటుతో ధిక్కార స్వరాలై "బాంచన్ దొర కాల్మొక్త" అన్న వెట్టి మనుషులు చేత "దొర ఏందిరో నీ దొర పికుడేం దిరో" అంటూ బందూకులు పట్టించిన. కమ్యూనిస్టులు నడిపిన పోరాట మదిని కొనియాడారు.4వేల మంది వీర మరణం పొందారన్నారు. అ పోరాటమే ఫలితమే 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారని 3 వేలకు పైగా గ్రామ స్వరాజ్యాలు ఎర్పాటు చేసిన చరిత్రాత్మకమైన పోరాటమన్నారు. కానీ కులం పేర మతం పేర,ప్రాంతం పేరుతో జరిగిన పోరాటం కాదని కానీ ఆ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని కాషాయ మూకలు హిందూ, ముస్లిం పేరుతో మతం రంగు పులిమి బిజెపి రాజకీయ పబ్బం గడుపుకోవాడాని హిందూ ముస్లింలపై మధ్యన చిచ్చు పెట్టుతుందన్నారు. నాటి వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రికరిస్తున్నారనివిమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో అబద్ధాలతో కమ్యూనిస్టుల పోరాట చరిత్రను తూడిపేయాలని "రజాఖార్ ఫైల్స్" లాంటి సినిమాలు తీసి సమాజంలోని నేటి యువతి యువకులను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు పోరాట చైతన్యం కలిగిన వారని బిజెపి మత రాజకీయాలు ఈ గడ్డపై సాగ నివ్వరని హెచ్చరించారు. భూమికోసం, భుక్తి కోసం,వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన అ పోరాట వారసత్వాన్ని స్ఫూర్తితో ప్రజ సమస్యలపై సిపిఎం పని చేస్తుందని భవిష్యత్తులో యాచారం మండలంలో చాలా సమస్యలు ఉన్నాయని స్థానిక సమస్యలపై ఆందోళన పోరాటాలు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ యాచారం మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ చందు నాయక్ మంతన్ గౌరెల్లి గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మి కిషన్, మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య, కే తావు నాయక్ నాయక్, ఉడతల జంగయ్య, విప్లవ కుమార్, భూషణ్, శ్రీకాంత్, కుంటూర గిరి కాంత్ ,ఆర్ కృష్ణ, రమేష్, మహేష్ ,ఉస్మాన్ ,శ్రీనాథ్ పార్టీ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బొల్లి కన్మణి పుట్టినరోజు వేడుకలు వృద్ధాశ్రమంలో అన్నదానం, పాఠశాలలో విద్యా సామగ్రి పంపిణీ





**తలకొండపల్లి, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన బొల్లి రమేష్ కూతురు బొల్లి కన్మణి ద్వితీయ పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం కల్వకుర్తి పట్టణంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓల్డ్ ఏజ్ హోమ్ (వృద్ధాశ్రమం) నిరుపేద వృద్ధులకు 50 కిలోల బియ్యం, పండ్లను పంపిణీ చేశారు. వృద్ధుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆంజనేయులు సార్‌తో పాటు వృద్ధాశ్రమ సిబ్బంది, నిర్వాహకులు పాల్గొన్నారు.పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కేవలం వృద్ధాశ్రమమే కాకుండా,విద్యానగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కూడా సహాయం అందించారు.కన్మణి పుట్టిన రోజు సందర్భంగా పాఠశాల విద్యార్థులకు పలకలు (స్లేట్స్), టేబుల్ బుక్స్, మరియు విద్యా చార్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కవిత , ఉపాధ్యాయ బృందం మరియు పాఠశాల సిబ్బంది పాల్గొని కన్మణికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని వారు కొనియాడారు.

# భూ నక్ష సర్వే ప్రారంభం.. ఏళ్ల నాటి రైతుల సమస్యకు పరిష్కారం



**కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) :**
కేశంపేట మండలం చింత కుంట ప ల్లి గ్రామంలో ఏళ్లుగా కొనసాగుతున్న భూ నక్ష సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభిస్తోంది. గ్రామంలోని వ్యవసాయ భూములకు నక్ష లేకపోవడంతో రైతులు భూముల హద్దులు, లావాదేవీల విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ సమస్యను పలుమార్లు నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఎన్నికల ముందు గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు గ్రామస్తులు సమస్యను వివరించగా, వెంటనే స్పందించి నక్ష సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం గురువారం గ్రామంలో భూ నక్ష ఏర్పాటు కోసం సర్వే ప్రారంభమైంది. గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనేమోని మల్లేష్ యాదవ్‌తో కలిసి రైతులు, గ్రామస్తులు సర్వేను పరిశీలించారు. భూములకు నక్ష ఏర్పాటు పూర్తయితే భూ తగాదాలు తగ్గడంతో పాటు రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఎదురుచూసిన సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడటంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, కొండల్ రెడ్డి, మహేందర్, అనేమోని కుమార్, అంజయ్య యాదవ్, హనుమంతు యాదవ్, ఆర్. నరసింహ తదితర రైతులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలపై నిగా పెట్టిన ఎస్సై రాజమౌళి.



**ఇల్లందు, సెప్టెంబరు 11 (జర్నలిస్ట్ ఫైల్) :**
టేకులపల్లి మండలం బోడు ఎస్సై రాజమౌళి ఆకస్మిత తనిఖీలు చేపట్టారు. గంజాయి పై ప్రత్యేక దృష్టి పెడతామని హెచ్చరించారు. అనుమానాస్పద వాహనాలను. తనిఖీ చేశారు వాహనాలకు సరైన పత్రాలు ఉండాలని లేనియెడల వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే మాకు సమాచారం అందించాలని తెలిపారు .మాదకద్రవ్యాలు అమ్మిన గాని సేవించిన గాని వారిపై కఠిన చర్యలు తప్పదు అంటూ హెచ్చరించారు గ్రామీణ ప్రాంతంలో గంజాయి తాగిన అమ్మిన గాని వారిపై ప్రత్యేకంగా దృష్టి పెడతాం అన్నారు.

## జిల్లాలో మాతృ మరణాల నివారణే ధ్యేయం



**○ సబ్-డిస్ట్రిక్ట్ స్థాయి మాతృ మరణాల పర్యవేక్షణ సమావేశం**

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**జిల్లాలో మాతృ మరణాలను పూర్తిగా నివారించి, సురక్షిత మాతృత్వాన్ని సాధించడమే లక్ష్యంగా జిల్లా మాతృ మరణాల పర్యవేక్షణ మరియు స్పందన సబ్-డిస్ట్రిక్ట్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించబడింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో భాగంగా ఒక నిర్దిష్ట మాతృ మరణాల కేసుకు సంబంధించి సమగ్రమైన సమీక్ష చేపట్టారు. బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రి గైనకాలజిస్టులు, నివాస వైద్య అధికారులు, అనస్థీషియా వైద్యులు, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులు, చికిత్స అందించిన సిబ్బంది మరియు రక్త నిధి అధికారులతో కూలంకషంగా చర్చించారు. కేసుకు సంబంధించిన వైద్య చరిత్ర, రోగిని వేరే ఆసుపత్రికి పంపే ప్రక్రియ, అత్యవసర వైద్య సేవలు వంటి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ మాట్లాడుతూ ప్రమాదకర స్థితిలో ఉన్న గర్భిణులను గర్భధారణ ప్రారంభ దశలోనే గుర్తించి, నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సంక్లిష్టమైన కేసులను ఆలస్యం చేయకుండా తక్షణమే మెరుగైన వైద్య కేంద్రాలకు పంపాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అందించే గర్భిణీ సంరక్షణ సేవలు మరింత నాణ్యతతో ఉండేలా చూసుకోవాలన్నారు. భవిష్యత్తులో మాతృ మరణాలు పునరావృతం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో సరిదిద్దే చర్యలు చేపట్టాలని సూచించారు .

ఈ కార్యక్రమంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం సిబ్బంది, కార్యక్రమ అధికారులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, జిల్లా ప్రజా ఆరోగ్య నర్సింగ్ అధికారి, కార్యాలయ సిబ్బందితో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది, గ్రామ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్చూరు లో 'ఫ్రైడే - డ్రై డే' కార్యక్రమం



**○ క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా మలేరియా అధికారి వి. నాగార్జున**

**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):** కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా ప్రతి శుక్రవారం నిర్వహించే 'ఫ్రైడే - డ్రై డే' కార్యక్రమాన్ని పర్చూరు మండలంలో విస్తృతంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా మలేరియా అధికారి వి. నాగార్జున పర్చూరు లో క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పర్యటించారు.

ఇంటింటికీ తిరుగుతూ ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు మరియు మిడ్-లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను ఆయన పరిశీలించారు. ప్రతి ఇంట్లోని నీటి నిల్వ ఉండే డ్రమ్ములు, కూలర్లు, పూల కుండీలు, టైర్లు, కొబ్బరి చిప్పలను తనిఖీ చేశారు. ఎక్కడైనా దోమల లార్వా కనిపిస్తే వెంటనే లార్వా నాశిని మందు వేయించారు.

ఈ సందర్భంగా డి.ఎం.ఓ. వి. నాగార్జున మాట్లాడుతూ ప్రతి శుక్రవారం తప్పనిసరిగా 'డ్రై డే' పాటించాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి పరిసరాలలో ఎక్కడా వర్షపు నీరు లేదా ఇతర నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, నిల్వ ఉండే నీటి పాత్రలపై ఖచ్చితంగా మూతలు ఉంచాలని సూచించారు.

ప్రతి మూడు రోజులకోసారి నీటి నిల్వలను ఖాళీ చేసి శుభ్రం చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం పర్చూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ప్రయోగశాలను సందర్శించి, రికార్డులను పరిశీలించారు. అక్కడ నమోదవుతున్న జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, వైద్య సిబ్బందికి పలు తగు సూచనలు, సలహాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ సాయిప్రశాంతి, డాక్టర్ పి. పృథ్వీరాజ్, ఎస్.యు.ఓ.లు రవిబాబు, పి. శ్రీనివాసరావు, ఎం.పి. హెచ్.ఇ.ఓ.లు టి. సుధాకర్, జి.పి. ఆంజనేయరావు, పి.ఎస్. మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ పోషణ మాహ్



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్):**సమాజంలో పోషకాహార లోపాన్ని నివారించి, తల్లులు మరియు శిశువుల ఆరోగ్యాన్ని పరిరక్షించే లక్ష్యంతో చేపట్టిన 'అంతర్జాతీయ పోషణ మాహ్' కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ కాకుమాను మండలం శాఖ ఆధ్వర్యంలో లో కాకుమాను సెక్టర్ పరిధిలో కొండపాటూరు గ్రామంలో సూపర్ వైజర్ వెంకాయమ్మ ఆధ్వర్యంలో పాండ్రపాడు సెక్టార్ పరిధిలో కొత్త కొలిమర్ల లో సెక్టార్ సూపర్ వైజర్ ప్రేమలత ల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక గర్భవతులు, బాలింతలు మరియు పెద్ద సంఖ్యలో తల్లులు ఉత్సాహంగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ ల సూపర్ వైజర్ లు పి. వెంకాయమ్మ, ప్రేమలత లు తల్లులనుద్దేశించి మాట్లాడుతూ, పౌష్టికాహారం అనగానే ఖరీదైన పదార్థాలు కొనాల్సిన అవసరం లేదని, మన ఇంటి చుట్టూ దొరికే వనరులతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ప్రముఖంగా మార్కెట్లో లభించే ఖరీదైన ఆహార పదార్థాల కంటే, మన స్థానిక ప్రాంతంలో లభించే రాగులు, జొన్నలు, వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పప్పుధాన్యాలు మరియు గుడ్లలో అత్యధిక పోషక విలువలు ఉంటాయని తెలిపారు. వీటిని నిత్య జీవితంలో భాగం చేసుకోవడం ద్వారా తక్కువ ఖర్చుతోనే కుటుంబాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని వివరించారు. గర్భధారణ సమయంలో మహిళలు శారీరకంగా బలంగా ఉండటానికి ఐరన్, కాల్షియం మరియు ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇది పుట్టబోయే బిడ్డ ఆరోగ్యకరమైన ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన మొదటి ఆరు నెలల పాటు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని, ఇది శిశువు రోగ నిరోధక శక్తిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు మరియు మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## డోర్ టు డోర్ కార్యక్రమం పూర్తి చేసిన టీడీపీ శ్రేణులకు ప్రత్యేక గుర్తింపు

**○ వెలిగొండ, శ్రీశైలం పర్యటన ప్రకటించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని 100% పూర్తి చేసిన టీడీపీ శ్రేణులతో కలిసి వెలిగొండ ప్రాజెక్టు సందర్శించనున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించి, ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజల నుండి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు చిరువ్యాపారులకు జీవనాధారంగా మూడు తోపుడు బండ్లను అందజేశారు.

అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన లిఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...లి కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా ఎన్టీఆర్ భరోసా కొత్త పెన్షన్ల నమోదు ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో, డివిజన్లలో ఇంటింటికి వెళ్లి అర్హులైన పేదలను గుర్తించి పెన్షన్ దరఖాస్తులు చేసుకునేలా సహాయం అందించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

ఇటీవల చేపట్టిన "ఇంటింటికి కూటమి ప్రభుత్వం – – సంక్షేమ విజయాలు" కార్యక్రమాన్ని గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో విజయవంతంగా పూర్తి చేసిన బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్‌చార్జీలు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ అధ్యక్షులు మరియు కార్యకర్తలను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేరవేయడంలో వారు చూపిన అంకితభావం ప్రశంసనీయమని అన్నారు.

వారి సేవలకు గుర్తింపుగా సెప్టెంబర్ 13 (ఆదివారం) న ప్రత్యేక పర్యటనను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రకటించారు. ఈ పర్యటనలో డోర్ టు డోర్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేసిన నాయకులు, కార్యకర్తలు వెలిగొండ ప్రాజెక్టును సందర్శించడంతో పాటు శ్రీశైలం శ్రీ మల్లికార్జున స్వామివారి దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర వ్యవసాయాభివృద్ధికి, లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ చారిత్రాత్మక ప్రాజెక్టును పార్టీ కార్యకర్తలు ప్రత్యక్షంగా వీక్షించి దాని ప్రాముఖ్యతను తెలుసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ పర్యటనను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ శ్రేణులు మరింత చురుకుగా పనిచేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

## కాకుమానులో విజయవంతంగా ఉచిత మెగా వైద్య శిబిరం



**కాకుమాను (జర్నలిస్ట్ ఫైల్ ):**గుంటూరు జిల్లా కాకుమానులో హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, కాటూరి మెడికల్ కాలేజి హాస్పిటల్, విజయవాడ పెద్దేశ్వర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో గురు, శుక్రవారాల్లో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమయింది. ప్రముఖ పారిశ్రామికవేత్త, ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ నేతృత్వంలో వారి ఇన్నోవేషన్ సెంటరులో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి కాకుమాను, దాని పరిసర గ్రామాల ప్రజలు భారీ స్థాయిలో పాల్గొని వివిధ రకాల వైద్య సేవలు పొందారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఈ శిబిరాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే కాటూరి మెడికల్ కాలేజి హాస్పిటల్ అధినేత కాటూరి సుబ్బారావు రూ. కోటిన్నర విలువగల ఎంఎంహెచ్ ప్రత్యేక వాహనాన్ని ఈ శిబిరానికి పంపించగా ఇందులో అవసరమైన వారికి అన్ని రకాల వైద్యపరీక్షలు ఉచితంగా చేసినట్లు కేఎంసీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఫణీంద్ర తెలిపారు. అన్ని విభాగాలకు చెందిన తమ వైద్య నిపుణులు వచ్చిన వారందరికీ పరీక్షలు నిర్వహించారని, ఉచితంగా మందులు అందజేశామన్నారు. ఈ ఆసుపత్రివారు రెండు రోజుల్లో 850 మందికి వైద్య చికిత్సలు చేయగా అందులో 300 మంది కాటూరి ఆసుపత్రిలో చికిత్సలు పొందేందుకు అర్హులయ్యారు.

హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి వారు కాకుమాను పంపించిన రూ. రెండుకోట్ల విలువైన క్యాన్సర్ పరీక్షల వాహనంలో రెండు రోజుల్లో 375 మందికి పరీక్షలు చేయగా అందులో 20 మందికి వ్యాధి సోకినట్లు గుర్తించామని డాక్టర్ రవిశంకర్ తెలిపారు. వీరు తమ క్యాన్సర్ ఆసుపత్రికి వస్తే చికిత్సలు చేస్తామని ఆయన చెప్పారు. విజయవాడ పెద్దేశ్వర్ ఆసుపత్రివారు రక్త పరీక్షలు, ఎకో పరీక్షలు ఉచితంగా చేయడం వల్ల వాటివద్ద జనం అధికంగా కనిపించారు. రెండు రోజుల్లో ఈ ఆసుపత్రి వారు 650 మందికి ఉచిత వైద్య చికిత్సలు నిర్వహించారు. చివరి రోజు వైద్య శిబిరాన్ని కొంగర మల్లేశ్వరరావు, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, టీడీ ప్రసాద్, మండవ లక్ష్మీ నారాయణ, ఆరి నాగేశ్వరరావు, సత్యవతి తదితరులు పర్యవేక్షించారు. మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లకు, వైద్య సిబ్బందికి, తదితరులకు వీరు ధన్యవాదాలు తెలిపారు.

## డిమాండ్లు తీరేవరకు నిరసనలు కొనసాగిస్తాం

**○ బాపట్ల జిల్లా ఆరోగ్య శాఖ కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య జేఏసీ**



**బాపట్ల జిల్లా (జర్నలిస్ట్ ఫైల్ ):**ఆరోగ్య శాఖ లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించేవరకు తమ శాంతియుత నిరసనలు కొనసాగుతాయని బాపట్ల జిల్లా ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ సభ్యుడు సత్యం రాజు కూరపాటి స్పష్టం చేశారు. శుక్ర వారం మధ్యాహ్నం భోజనం విరామ సమయంలో స్థానిక ఏరియా వైద్యశాల లో నల్ల బెలూన్ లతో తమ నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను రెగ్యులరైజ్ చేయాలని, రెగ్యులరైజ్ చేసేంతవరకు 100% గ్రాస్ జీతం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు ట్రాన్స్ఫర్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగి మరణిస్తే 50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తుందనే నమ్మకం ఉందని, మరోసారి చర్చలకు కూడా ఆహ్వానిస్తుందనే విశ్వాసం ప్రభుత్వం పైన తమకుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్స్. అనూష,ల్యాబ్ టెక్నీషియన్లు నీలిమ, సునీత,బయో మెడికల్ ఇంజనీర్ నళిని కుమారి, ఫార్మసిస్టులు నళిని, సుధ, శాంతి మనోజ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడే పాటించాలి : సిహెచ్ఓ సాంబశివారెడ్డి



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం మండల పరిధిలో ప్రతి ఒక్కరూ వారి ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతి శుక్రవారం తప్పనిసరిగా ఫ్రైడే డ్రైడే పాటించాలని బి.మఠం పిహెచ్సి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సాంబశివారెడ్డి తెలియజేశారు. శుక్రవారం సి హెచ్ ఓ సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పీహెచ్సీ వైద్య సిబ్బంది గంగిరెడ్డి పల్లె,నరసన్నపల్లె గ్రామాలలో ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే లార్వా సర్వే అలాగే లెప్రసీ వ్యాధి సర్వే నిర్వహించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే మలేరియా డెంగ్యూ తదితర వ్యాధులు రాకుండా నివారించుకోవచ్చు అన్నారు. అలాగే మన గ్రామంలో ముఖ్యంగా నీటి కుంటలు లేకుండా ఆ కుంటలలో మురికి నీరు ఉండకుండా చూసుకోవాలని ఆయన తెలియజేశారు. జ్వరాల బారిన పడకుండా దోమతెరలు,అలాగే రాత్రి వేళల్లో ఫుల్ హ్యాండ్స్ గల చొక్కాలు ధరించి దోమల నుంచి రక్షణ పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు మాధవ వెంకటరెడ్డి ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్ విజయలక్ష్మి,ఆశా వర్కర్ లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పోలీసుల బస.. ప్రజలతో మమేకం

**○ పల్లెనిద్రతో సమస్యల పరిష్కారం.. నేరాల నియంత్రణకు చర్యలు**

**○ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మరింత చేరువై వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకునే ఉద్దేశంతో గుంటూరు జిల్లా పోలీసులు 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేవేంద్రపాడు, వల్లభాపురం, జొన్నలగడ్డ, చిన్నకొండ్రుపాడు గ్రామాల్లో దుగ్గిరాల, కొల్లిపర, నల్లపాడు, పత్తిపాడు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు తమ సిబ్బందితో కలిసి రాత్రి గ్రామాల్లో బస చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి స్థానిక సమస్యలు, శాంతిభద్రతల పరిస్థితిపై చర్చించారు.

ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి ప్రజలకు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, అసాంఘిక కార్యకలాపాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. చిన్నచిన్న సమస్యలకు ఆవేశాలకు లోనుకాకుండా చట్టపరమైన మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినప్పుడు భయాందోళనలకు గురికాకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతో నేరాలను ముందుగానే గుర్తించి నివారించడంతో పాటు గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత పటిష్టంగా కొనసాగించవచ్చని తెలిపారు.

**సీసీ కెమెరాల ఏర్పాటుకు సూచనలు**

గ్రామాల్లో భద్రతను పెంచేందుకు ఇళ్లు, వ్యాపార సంస్థలు, దేవాలయాలు, ఇతర ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు సూచించారు. సీసీ కెమెరాల వల్ల నేరాలను అరికట్టడంతో పాటు నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడంలో పోలీసులకు కీలక సహకారం లభిస్తుందని వివరించారు. గ్రామస్థులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హామీ ఇచ్చారు. ప్రజలు పోలీసులతో నిరంతరం సమన్వయంతో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన శ్మశాన వాటికల అభివృద్ధి : ఎమ్మెల్యే నసీర్



**○ ఆటోనగర్‌లో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను పరిశీలించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్**

**○ ఆటోనగర్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు**

**○ శ్మశాన వాటికలకు వెళ్లే రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):**ఆటోనగర్ లో హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటిక ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆటోనగర్ లోని హిందూ, క్రిస్టియన్ శ్మశాన వాటికలను ఎమ్మెల్యే నసీర్ పరిశీలించారు. శ్మశాన వాటికలకు వెళ్లే రహదారి నిర్మాణానికి తగిన అంచనాలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. దీంతోపాటు శ్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి పైపు లైన్ల నిర్మాణానికి సుమారు రూ. 100 కోట్లు వెచ్చించామని, అన్నిరోడ్లకు మహర్దశ తీసుకొస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో కనీసం తట్టమట్టి కూడా వేయడానికి చేతగాని నాయకులు.. ఇప్పుడు మాట్లాడటం దారుణమన్నారు. ద

ఆటోనగర్ లో ప్రతి రోజూ సుమారు 20 వేల మందికిపై కార్మికులు పని చేస్తుంటారని, దీని దృష్ట్యా అన్న క్యాంటీన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలో ప్రభుత్వం నుంచి ఆమోదం తెలిపిన వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. ఇక్కడ మంచినీటి పైపు కనెక్షన్ ను అతి తక్కువ ధరకే అందించాలని గుంటూరు మునిసిపాలిటీకి ప్రతిపాదించామని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమానికి రూ. 350 కోట్లు వెచ్చించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరువ చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నూతన పింఛన్ల మంజూరుకు సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉంటే తమ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. నగరంలో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాన్ని సమర్థవంతంగా చేపట్టడంతోపాటు ఆహ్లాదానికి పెద్ద పీట వేస్తున్నామన్నారు. పార్కులు, వాకింగ్ ట్రాక్ ల నిర్మాణం చేపడుతన్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీ అభ్యర్థులను బలపరచడం ద్వారా గుంటూరు నగర అభివృద్ధిని మరింత మెరుగ్గా సాధించేందుకు వీలుంటుందని చెప్పారు.

## చక్కని చేతిరాత ప్రతిభకు 'అవార్డ్ ఆఫ్ మెరిట్' సర్టిఫికెట్



**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):**బ్రహ్మంగారిమఠం మండలంలోని బ్రైట్ మైండ్స్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని అంబిశెట్టి నాగ చార్విత చక్కని చేతిరాతలో ప్రతిభ కనబరిచి ఆ క్లాస్ ఫస్ట్ గా 'అవార్డ్ ఆఫ్ మెరిట్' సర్టిఫికెట్‌ను అందుకుంది. ఎం.ఎం. రెడ్డి అక్షర హ్యాండ్‌రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన గుడ్ హ్యాండ్‌రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు నాగ చార్విత కు ఈ ప్రశంసాపత్రం అందజేశారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎం.ఎం. రెడ్డి అక్షర హ్యాండ్‌రైటింగ్ అకాడమీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో చక్కని చేతిరాత, అక్షర స్పష్టత, రాత వేగం, పరిశుభ్రత వంటి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ అందించారు. నాగ చార్విత, మరియు స్కూల్ ఫస్ట్,సెకండ్,థర్డ్ సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఈ ప్రతిభకు బ్రైట్ మైండ్ పాఠశాల కరెస్పాండెంట్ శిల్ప, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. .భవిష్యత్తులో విద్యతో పాటు ఇతర సృజనాత్మక రంగాల్లోనూ మరింత రాణించాలని ఆకాంక్షించారు. చేతిరాతలో ప్రతిభను గుర్తించి సర్టిఫికెట్ అందుకోవడం పట్ల విద్యార్థిని చార్విత సంతోషం వ్యక్తం చేసింది.

## గుంటూరు నగర వార్డుల పునర్విభజనపై 39 అభ్యంతరాలు, వినతులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన వార్డుల పునర్విభజన ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి ఇప్పటివరకు 39 అభ్యంతరాలు, వినతులు, సూచనలు అందినట్లు గుంటూరు తూర్పు నియోజకవర్గ ఈఆర్ఓ, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ వివరాలు వెల్లడించారు. అందిన 39 వినతుల్లో తెలుగుదేశం పార్టీ నుంచి 25, జనసేన పార్టీ నుంచి 9, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 2, భారతీయ జనతా పార్టీ నుంచి 2, వ్యక్తిగతంగా ఒక వినతి ఉన్నట్లు తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు సమర్పించిన అభ్యంతరాలు, సూచనలను ప్రభుత్వ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పరిశీలించి, సెప్టెంబరు 12న కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ)కి పంపనున్నట్లు తెలిపారు. అనంతరం సెప్టెంబరు 13న సీడీఎంఏ తుది వార్డులను ఖరారు చేస్తుందని, సెప్టెంబరు 14న ఆంధ్రప్రదేశ్ గెజిట్ ఫారం-VIలో తుది నోటిఫికేషన్‌ను ప్రచురించనున్నట్లు కమిషనర్ కె. మయూర్ అశోక్ వెల్లడించారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## కేంద్ర మంత్రి జేపీ నడ్డాకు ఘన స్వాగతం



విజయవాడ,(జర్నలిస్ట్ ఫైల్):రాష్ట్ర పర్యటన నిమిత్తం విజయవాడ గన్నవరం విమానాశ్రయానికి శుక్రవారం సాయంత్రం విచ్చేసిన కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి, బీజేపీ జాతీయ మాజీ అధ్యక్షుడు జేపీ నడ్డాకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్‌తో పాటు పలువురు బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయంలో నడ్డాకు పుష్పగుచ్ఛాలు అందించి సాదరంగా స్వాగతం పలికారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు.

## పునరావృత సర్వేలతో ఏఎన్ఎంలపై పని ఒత్తిడి తగ్గించాలి



- ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు ఏపీ ఎన్జీజీవో సంఘం వినతి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, పునరావృత సర్వేలతో పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించాలని ఏపీ ఎన్జీజీవో సంఘం నాయకులు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌ను కోరారు. గుంటూరు మెడికల్ కాలేజీలో శుక్రవారం మంత్రి సత్యకుమార్‌ను కలిసి ఏఎన్ఎంల సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

గుంటూరు జిల్లా ఏపీ ఎన్జీజీవో సంఘం అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. ఏఎన్ఎంలు అభయ యాప్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ సర్వేల్లో ఇప్పటికే పలుమార్లు ఐడీలు జనరేట్ చేసినప్పటికీ, తాజాగా లెప్రసీ సర్వే కోసం మళ్లీ కొత్త ఐడీలు సృష్టించాల్సి వస్తోందని తెలిపారు. దీంతో ప్రజల నుంచి మరోసారి ఓటీపీలు తీసుకోవాల్సి రావడం ఇబ్బందికరంగా మారిందన్నారు. ఎల్‌సీడీసీ సర్వేకు సంబంధించి ఇప్పటికే మూడు సార్లు అభయ యాప్‌లో ఐడీలు జనరేట్ అయ్యాయని, ఇప్పుడు లెప్రసీ సర్వే కోసం మళ్లీ కొత్త ఐడీలు సృష్టించడంతో ప్రజలు ఓటీపీలు చెప్పేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు సెల్‌ఫోన్లు, ట్యాబ్‌లు తరచూ హ్యాంగ్ అవుతున్నాయని, సర్వర్లు సరిగా పనిచేయకపోవడంతో సర్వేలు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. ఒక్క లెప్రసీ సర్వే నిర్వహణకే సిబ్బంది ఒక పూట పని సమయాన్ని కోల్పోయే పరిస్థితి ఉందని, దీనివల్ల ఏఎన్ఎంలపై అదనపు పని భారం పడుతోందని నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పదేపదే నిర్వహిస్తున్న సర్వేల నుంచి, ముఖ్యంగా ఓటీపీలు మరియు సాంకేతిక సమస్యల నుంచి ఏఎన్ఎంలకు విముక్తి కల్పించాలని కోరారు. ఈ అంశంపై ఏపీ ఎన్జీజీవో సంఘం తరఫున ఎంపీహెచ్ఏ ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఇదే విషయాన్ని వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ చక్రధర్, ఆరోగ్యశాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతికి కూడా వివరించినట్లు తెలిపారు. అదేవిధంగా నర్సింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రతినిధులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో సిబ్బంది కొరత సమస్యపై మంత్రికి వినతిపత్రం సమర్పించారు. మంత్రి సత్యకుమార్‌ను కలిసిన వారిలో ఏపీ ఎన్జీజీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ నాగూర్ షరీఫ్, రాష్ట్ర మహిళా వైస్ చైర్‌పర్సన్ వై. పద్మజ, గుంటూరు నగర శాఖ అధ్యక్షులు చింతల కళ్యాణ్ కుమార్, కార్యదర్శి జి.వి. కోటేశ్వరరావు, గుంటూరు సిటీ మహిళా చైర్‌పర్సన్ ఏఎన్ఎం అరుణ, జిల్లా మహిళా చైర్‌పర్సన్ తాజున్నిస్సా, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు బియ్యం పరిమాణం పెంచాలి

- మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆప్టా వినతి

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలోని పాఠశాలల్లో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు కేటాయిస్తున్న బియ్యం పరిమాణాన్ని పెంచాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) కోరింది. ఈ మేరకు ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.జి. మెహది మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌కు, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులకు లేఖ ద్వారా ప్రాతినిధ్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మెనూ ఎంతో బాగుండటంతో పాటు నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్న కారణంగా విద్యార్థులు భోజనాన్ని తృప్తిగా చేస్తున్నారని వారు తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక్కొక్కరికి 100 గ్రాములు, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 150 గ్రాముల బియ్యం మాత్రమే కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. నాణ్యమైన బియ్యం, మెరుగైన మెనూ కారణంగా విద్యార్థులు భోజనాన్ని పూర్తిస్థాయిలో తీసుకుంటుండటంతో ప్రస్తుత బియ్యం పరిమాణం సరిపోవడం లేదని ఆప్టా నాయకులు తెలిపారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బియ్యం కేటాయింపును పెంచాలని మంత్రి, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులను కోరారు.

## ఎమ్మార్సీ గ్రాంట్లు మంజూరు చేయడం

- ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం



అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర వ్యాప్తంగా ఎంఆర్సీ ల నిర్వహణ గ్రాంట్స్ మంజూరు చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తమీం అన్సారియా ఉత్తర్వులు విడుదల చేయడం పట్ల ఎంఈఓ 1 అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం 2026–27 అకడమిక్ సంవత్సరానికి గాను 26 జిల్లాలలో గల 679 మండల రిసోర్స్ సెంటర్స్ కు రూ. 543.20 లక్షల గ్రాంట్స్ మంజూరు చేశారన్నారు. ఇందులో ఒక్కో ఎమ్మార్సీ కి నిర్వహణ నిధులు రూ. 80 వేల చొప్పున మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారని సామల తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సామల మాట్లాడుతూ ఎమ్మార్సీ గ్రాంట్స్ విడుదల చేయాలని ఎంఈవో 1అసోసియేషన్ తరుపున ఇటీవల సమగ్ర శిక్షా రాష్ట్ర ఎస్పీడీ బి శ్రీనివాస రావు గారిని కలిసి కోరడం జరిగిందని ఫలితంగా, ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయడం చాలా హర్షనీయమని రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బుక్కా రవి నాయక్ లు అన్నారు.

# కూటమి ఐక్యతను ఓర్వలేకే జగన్ ప్రేలాపనలు : మంత్రి సత్యకుమార్ యాదవ్

- ముందు అసెంబ్లీకి వచ్చే ధైర్యం తెచ్చుకో
- డీఎస్సీపై చర్చకు రమ్మంటే ఎందుకు రావడం లేదు?
- నాలుగు గోడల మధ్య మైక్ ముందు మాట్లాడేవారిని ఏమనాలి?
- అవినీతి సామ్రాట్ జగన్ సిగ్గు గురించి మాట్లాడటం హాస్యాస్పదం
- జగన్ వ్యాఖ్యలపై భాజపా జాతీయ నేత, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆగ్రహం



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భాజపా జాతీయ నేత, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుండటాన్ని ఓర్వలేక జగన్ దిక్కుతోచని స్థితిలో ప్రేలాపనలు చేస్తున్నారని విమర్శించారు. తెదేపా, భాజపా, జనసేనల మధ్య ఉన్న బలమైన ఐక్యతను జగన్ తన వికృత వ్యాఖ్యలతో దెబ్బతీయలేరని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై అసెంబ్లీలో చర్చకు వచ్చే ధైర్యం లేని జగన్ నాలుగు గోడల మధ్య మైక్ ముందు మాట్లాడటం ద్వారా తన రాజకీయ అసమర్థతను బయటపెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. డీఎస్సీ నియామకాలపై అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్.. విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ పలుమార్లు చర్చకు సిద్ధమని సవాల్ చేసినా ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.

డీఎస్సీ విషయంలో భాజపా, జనసేనలు సిగ్గుతో తలవంచుకోవాలని జగన్ మాట్లాడటం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని మంత్రి విమర్శించారు. కూటమి గురించి మాట్లాడే ముందు జగన్ తన రాజకీయ చరిత్రను, ఐదేళ్ల పాలనలో తాను చేసిన పనులను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. ఈ మేరకు మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**డీఎస్సీపై చర్చకు రమ్మంటే ఎందుకు పారిపోతున్నారు?:** డీఎస్సీ సమస్యపై అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. "చర్చకు రమ్మంటే అసెంబ్లీకి రావడం లేదు. ప్రజల ముందు నిలబడి మాట్లాడే ధైర్యం లేదు. బయటకు వచ్చి మాత్రం ప్రభుత్వం, భాజపాపై విమర్శలు చేస్తున్నారు. ఇదేనా జగన్ రాజకీయ ధైర్యం?" అని ప్రశ్నించారు. ప్రజలు ఎన్నుకున్న సభలో ప్రజా సమస్యలపై మాట్లాడటం ప్రతిపక్ష నాయకుడి బాధ్యత అని అన్నారు. అసెంబ్లీలో తన వాదనను వినిపించే అవకాశం ఉన్నప్పటికీ జగన్ సభకు దూరంగా ఉండటానికి కారణమేంటని నిలదీశారు. మైకుల ముందు మాట్లాడటం కాదు.. అసెంబ్లీలో నిలబడి సమాధానం చెప్పాలని సవాల్ చేశారు.

**అసలు మీకు మాట్లాడే అర్హత ఉందా?:** తెదేపా, భాజపా, జనసేనలపై జగన్ చేసిన వ్యాఖ్యలపైనా సత్యకుమార్ తీవ్రంగా స్పందించారు. ప్రజల తీర్పుతో ఏర్పడిన కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి కోసం సమష్టిగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజల తీర్పును జీర్ణించుకోలేకనే జగన్ కూటమి పార్టీలపై విమర్శలు చేస్తు న్నారని మండిపడ్డారు.

**'కాక్రోచ్' గురించి మాట్లాడటం హాస్యాస్పదం:** తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా భ్రష్టుపట్టించిన, అవినీతిలో కూరుకుపోయిన, తల్లిని చెల్లిని మోసం చేసిన జగన్ 'కాక్రోచ్‌గా మారతా'నంటూ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మంత్రి వ్యాఖ్యానించారు. రాష్ట్రానికి జరిగిన నష్టానికి, యువతకు జరిగిన అన్యాయానికి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత బాబాయ్ హత్య గురించి ఏమంటారని జగన్ ను ప్రశ్నించారు. అసలు ప్రజలు మిమ్మల్ని ఎందుకు తిరస్కరించారో ఆలోచించుకోండి. కూటమి ఐక్యత గురించి మాట్లాడే ముందు మీ రాజకీయ చరిత్రను చూసుకోండి" అని జగన్‌కు హితవు పలికారు. "గతాన్ని ప్రజలు మర్చిపోలేదు. ఎవరు ఏం చేశారో ప్రజలకు తెలుసు. మీ పాలనలోని వైఫల్యాలను కప్పిపుచ్చుకోలేరు" అని స్పష్టం చేశారు.

**ఇప్పటికైనా చర్చకు రండి జగన్!:** జగన్‌కు నిజంగా డీఎస్సీపై, నిరుద్యోగ యువత సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సత్యకుమార్ మరోసారి సవాల్ చేశారు.

"మీతో చర్చించేందుకు మంత్రి శ్రీ నారా లోకేష్ సిద్ధంగా ఉన్నారు. ఆలస్యం మీవైపే ఉంది. ప్రజల ముందే నిజానిజాలు తేల్చుకుందాం" అని అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలపై చర్చకు, ప్రజలకు జవాబుదారీతనానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు

- గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ కల్పనపట్ల కృతజ్ఞతలు తెలిపిన ఉత్సవ సమితి



అమరావతి(జర్నలిస్ట్ ఫైల్): వినాయక చవితి పర్వదినాన్ని మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసిన గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించడంతో పాటు సింగిల్ విండో ద్వారా అనుమతులకు చొరవ చూపిన విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కు ఆంధ్రపదేశ్ గణేష్ ఉత్సవ సమితి కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు సచివాలయంలో మంత్రి లోకేష్ ను కలిసిన ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు.. వినాయక మండపాలకు ఉచిత్ విద్యుత్, సింగిల్ విండో అనుమతుల పట్ల కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా గణేష్ ఉత్సవాలు విజయవంతం కావడానికి వివిధ ప్రభుత్వ విభాగాలు ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితితో సమన్వయం చేసుకుని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు.

రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసేలా వినాయక మండపాల్లో రెండుపూటలా పూజానంతరం వరుణజపం చేయడానికి ముద్రించిన సంకల్పం, బీజాక్షర మంత్రం కరపత్రాన్ని మంత్రి లోకేష్ ఆవిష్కరించారు.

రాష్ట్రంలో గణేష్ మండపాల వద్ద ఏర్పాటుచేసేందుకు కావల్సిన కాషాయధ్వజాలు, పర్యావరణహిత బ్యానర్లు, వినాయక వ్రతకల్పం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు వీరమాచినేని రంగ ప్రసాద్, బీవీ రమణ కుమార్, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, కార్యదర్శి వలివర్తి దుర్గాప్రసాద్, ప్రభుత్వ సంబంధాల కార్యదర్శి గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

## రెండు డీఏల విడుదలపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ హర్షం

- ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

అమరావతి (జర్నలిస్ట్ ఫైల్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండు డీఏలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు, ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు ఒక ప్రకటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సెప్టెంబరు 5న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన చర్చల్లో రెండు డీఏలు విడుదల చేసేందుకు అంగీకారం తెలిపారని వారు గుర్తుచేశారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం జీవో నంబర్ 119, జీవో నంబర్ 120లను విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను 2027, 2028 సంవత్సరాల్లో మూడు వాయిదాల్లో చెల్లించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించి డీఏల విడుదలకు చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు పేర్కొన్నారు.

# సెప్టెంబర్ 13న రణభేరి సదస్సును జయప్రదం



వినుకొండ(జర్నలిస్ట్ ఫైల్): కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న గుంటూరులో నిర్వహించనున్న రణభేరి సదస్సును విజయవంతం చేయాలని కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, వైద్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి పిలుపునిచ్చారు.

వినుకొండ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో శుక్రవారం కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రణభేరి సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాచర్ల బుజ్జి మాట్లాడుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలకు చెందిన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు వేలాదిగా తరలివచ్చి గుంటూరులోని గుర్రం జాషువా కళా ప్రాంగణంలో జరిగే రణభేరి సదస్సును జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పీఆర్సీ అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలకు హామీ ఇవ్వడంపై ధన్యవాదాలు తెలిపారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి హామీ ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అప్పటివరకు కనీస టైం స్కేల్ అమలు చేయాలని కోరారు.

ఔట్సోర్సింగ్ ఉద్యోగులు 19 సంవత్సరాలుగా సేవలందిస్తున్నప్పటికీ నెలకు కేవలం రూ. 15 వేల వరకు మాత్రమే వేతనం పొందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల మేరకు రెగ్యులరైజేషన్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రకటించిన పెరిగిన వేతనాలకు అనుగుణంగా కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రాతిపదికన కనీస టైం స్కేల్ అమలు చేయాలని కోరారు. వివిధ ప్రభుత్వ శాఖలు, సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు కల్పించాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జీవితాల్లో కూడా సంతోషకరమైన నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు ఫార్మసిస్ట్ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ బాబు, ఎక్స్‌రే టెక్నీషియన్ సాంబశివరావు, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు, థెరపిస్ట్ బాలకృష్ణ, స్టాఫ్ నర్స్ సోమమ్మ, సుధారాణి, పారామెడికల్ ఉద్యోగులు రమ్య, ఎల్లమ్మ, సుబ్బు, ఐసీటీసీ ల్యాబ్ టెక్నీషియన్ రోజా, టీవీ డిపార్ట్‌మెంట్ నాయకుడు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో మరింత ముందుకు సాగాలి : గవర్నర్ అబ్దుల్ నజీర్




గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తన ఐదు దశాబ్దాల ఘనమైన ప్రస్థానాన్ని స్ఫూర్తిగా తీసుకుని, భవిష్యత్తులో విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సాంకేతికత ఆధారిత విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు సామాజిక పరివర్తన రంగాల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ మరియు విశ్వవిద్యాలయ కులాధిపతి ఎస్. అబ్దుల్ నజీర్ ఆకాంక్షించారు.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న గవర్నర్, ఐదు దశాబ్దాలుగా ఉన్నత విద్య, పరిశోధన, సామాజిక అభివృద్ధి రంగాల్లో విశ్వవిద్యాలయం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ చారిత్రాత్మక మైలురాయిని చేరుకున్న సందర్భంగా వైస్–చాన్సలర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ఐదు దశాబ్దాల ప్రస్థానం**

1967లో నల్లపాడులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పోస్ట్‌గ్రాడ్యుయేట్ సెంటర్‌గా ప్రారంభమైన సంస్థ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా 1976లో సంపూర్ణ విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకుందని గవర్నర్ తెలిపారు. 1976 సెప్టెంబర్ 11న అప్పటి భారత రాష్ట్రపతి శ్రీ ఫఖ్రుద్దీన్ అలీ అహ్మద్ చేతుల మీదుగా విశ్వవిద్యాలయం అధికారికంగా ప్రారంభమైందన్నారు.

కేవలం 10 విభాగాలు, 600 మంది విద్యార్థులతో ప్రారంభమైన విశ్వవిద్యాలయం నేడు 6,000 మంది విద్యార్థులు, 100 మంది పరిశోధక విద్యార్థులతో విస్తరించడం దాని విశేష ప్రగతికి నిదర్శనమని పేర్కొన్నారు.

ఆచార్య నాగార్జున వారసత్వానికి ప్రతీకగా మహోన్నత బౌద్ధ తత్వవేత్త, పండితుడు ఆచార్య నాగార్జున గౌరవార్థం 2004లో విశ్వవిద్యాలయానికి ఆయన పేరు పెట్టిన విషయాన్ని గవర్నర్ ప్రస్తావించారు.

ఆచార్య నాగార్జున భారతీయ తత్వచింతనకు, ముఖ్యంగా మాధ్యమక తత్వశాస్త్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయనకు తగిన నివాళిగా విశ్వవిద్యాలయంలో 'సెంటర్ ఫర్ బౌద్ధిస్ట్ స్టడీస్' ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

NAAC A+తో విశిష్ట గుర్తింపు, విద్యా ప్రమాణాలు, పరిశోధన మరియు సంస్థాగత పనితీరులో విశ్వవిద్యాలయం సాధించిన గుర్తింపులను గవర్నర్ ప్రశంసించారు.

2024లో NAAC A+ గ్రేడ్‌ను 4.00కి 3.46 CGPAతో సాధించిందని తెలిపారు. అలాగే QS Asia Rankings 2026లో 761–770 బ్యాండ్‌లో స్థానం సంపాదించి, ఆంధ్రప్రదేశ్‌లో అత్యున్నత ర్యాంక్ పొందిన విశ్వవిద్యాలయంగా నిలిచిందన్నారు.

NIRF Rankings 2025లో Overall Categoryలో 101–150 బ్యాండ్‌లో, ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాల్లో రెండవ స్థానాన్ని సాధించడం విశ్వవిద్యాలయ విద్యా ప్రగతికి ప్రతిబింబమని పేర్కొన్నారు.

**"బోధన, పరిశోధన విశ్వవిద్యాలయానికి రెండు కళ్ల వంటివి"**

బోధన మరియు పరిశోధన ఏ విశ్వవిద్యాలయానికైనా రెండు కళ్ల వంటివని గవర్నర్ అన్నారు. సమకాలీన సవాళ్లను పరిష్కరించేలా ప్రాథమిక, అనువర్తిత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

విద్యార్థుల్లో విమర్శనాత్మక ఆలోచన, ఆవిష్కరణాత్మక దృక్పథం, సమస్య పరిష్కార సామర్థ్యాలను పెంపొందించడంతో పాటు, విద్యను వాస్తవ ప్రపంచ అవసరాలతో అనుసంధానించాల్సిన అవసరం ఉందన్నారు.

**భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్య**

ఐదు దశాబ్దాల వారసత్వాన్ని కలిగిన విశ్వవిద్యాలయం సమాజంలోని వివిధ వర్గాలకు నాణ్యమైన ఉన్నత విద్యను మరింత విస్తృతంగా అందించేందుకు కృషి చేయాలని గవర్నర్ అన్నారు.

స్వర్ణోత్సవం గత విజయాలను జరుపుకునే సందర్భం మాత్రమే కాదని, భవిష్యత్తు పట్ల విశ్వవిద్యాలయం తన నిబద్ధతను పునరుద్ఘాటించుకునే అవకాశమని పేర్కొన్నారు.

ఆవిష్కరణలు, ఉన్నత స్థాయి పరిశోధన, పారిశ్రామికవేత్తల అభివృద్ధి, సాంకేతికత ఆధారిత విద్య, నైపుణ్యాభివృద్ధి, సామాజిక పరివర్తన వంటి రంగాలకు రాబోయే కాలంలో మరింత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

**ప్రముఖులను తీర్చిదిద్దిన విశ్వవిద్యాలయం**

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అనేక మంది ప్రముఖులను దేశానికి అందించిందని గవర్నర్ పేర్కొన్నారు. భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎన్.వి. రమణ, వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు, మంత్రులు, IAS, IPS అధికారులు, సాయుధ దళాల అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల వైస్–చాన్సలర్లు, శాస్త్రవేత్తలు, కార్పొరేట్ రంగ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు తదితరులు విశ్వవిద్యాలయ పూర్వ విద్యార్థులుగా ఉన్నారని తెలిపారు.

**స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ ఏ2047కు విశ్వవిద్యాలయం సహకారం**

గొప్ప విద్యా వారసత్వం, విస్తరిస్తున్న పరిశోధనా సామర్థ్యం, అంకితభావంతో పనిచేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది మరియు సమ్మిళిత, నాణ్యమైన విద్య పట్ల నిబద్ధతతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుంటుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

జ్ఞాన ఆధారిత, సమ్మిళిత, ప్రగతిశీల సమాజ నిర్మాణంతో పాటు స్వర్ణాంధ్ర మరియు వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యాల సాధనలో విశ్వవిద్యాలయం తన వంతు కీలక పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు.

స్వర్ణోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తుచేసుకుంటూ, భవిష్యత్తులో విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు సమిష్టిగా కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467